RNI TEL TEL 2024/89323.

# జన సంఘర్షణ

మా లక్ష్యం సామాన్యుని పక్షం

తెలుగు దినపత్రిక

| నిజామాబాద్ | సంపుటి : 03 | సంచిక : 101 | మే 03 ఆదివారం 2026 | ఎడిటర్ : రాచమల్లు మాధవి | పేజీలు 08 | వెల : రూ. 6.00 |
|---|---|---|---|---|---|---|
| Nizamabad | Vol: 03 | Vol: 101 | May 03 Sunday 2026 | Editor : rachamallu madhavi | Pages 08 | Cost: Rs 6.00 |


రైతుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ విఫలం 2

## ఉద్యోగుల సంక్షేమం పట్ల
# చిత్తశుద్ధితో ఉన్నాం

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక సమావేశం**



హైదరాబాద్ జనసంఘర్షణ

హైదరాబాద్ వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించి, రాష్ట్రంలోని ఉద్యోగుల సంక్షేమం పట్ల ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందనే విషయాన్ని మరోసారి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలు కీలక హామీలను ప్రకటించిన ఆయన, రిటైర్మెంట్‌కు సంబంధించిన ప్రయోజనాల కోసం రాబోయే వంద రోజుల్లో ఆరు వేల కోట్ల రూపాయలను చెల్లిస్తామని వెల్లడించారు. ఈ నిధులను ఏయే అవసరాల కోసం ఖర్చు చేయాలనే ప్రాధాన్యతలను ఉద్యోగులే స్వయంగా నిర్ణయించుకోవచ్చని ఆయన అవకాశం కల్పించారు. అలాగే, ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న ఆరోగ్య భద్రతా కార్డులను జూన్ ఒకటో తేదీలోపు ఖచ్చితంగా అందజేస్తామని హామీ ఇచ్చారు.పీఆర్సీకి సంబంధించి అధికారుల కమిటీని తక్షణమే నివేదిక సమర్పించాలని ఆదేశించిన సీఎం, ఆ నివేదికలోని అంశాలను పరిగణనలోకి తీసుకుని తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, వాటిని విజయవంతంగా అమలు చేయడంలో ఉద్యోగుల కృషి ఎంతో ఉందని, వారి సహకారం వల్లే ఇది సాధ్యమవుతోందని రేవంత్ రెడ్డి ప్రశంసించారు. ఉద్యోగుల సంక్షేమం కోసమే తమ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని చెబుతూ, అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి నెలా

➤ మిగతా 2వ పేజిలో..

## ‘ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్’
# లోగో ఆవిష్కరణ

- ఇటువంటి వేదికలు యువతకు, వ్యాపారులకు సరికొత్త మార్గాలకు సుగమం
- ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్ జనసంఘర్షణ

తెలంగాణను అంతర్జాతీయ స్థాయిలో ఒక కీలక వ్యాపార కేంద్రంగా (గ్లోబల్ బిజినెస్ హబ్) తీర్చిదిద్దే దిశగా రాష్ట్ర ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు ‘ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్’ కార్యక్రమం యొక్క లోగోను తాజాగా ఆవిష్కరించారు. రాష్ట్రంలోని వ్యాపారవేత్తలు, ఎగుమతిదారులు, స్టార్టప్‌లు, నైపుణ్యం కలిగిన నిపుణులు మరియు విద్యార్థులకు ప్రపంచస్థాయి అవకాశాలను కల్పించి, వారిని అంతర్జాతీయ స్థాయిలో విస్తరించేలా ప్రోత్సహించడమే ఈ వేదిక ప్రధాన లక్ష్యం. ఈ సందర్భంగా

➤ మిగతా 2వ పేజిలో..

## అమెరికాలోనూ
# ఇంధన సంక్షోభం

**కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేసిన ‘స్పిరిట్ ఎయిర్‌లైన్స్’**




వాషింగ్టన్ జనసంఘర్షణ

అమెరికా విమానయాన రంగంలో సంచలన పరిణామం చోటుచేసుకుంది. తీవ్ర ఆర్థిక సంక్షోభం, పెరిగిన ఇంధన ధరల భారంతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రముఖ విమానయాన సంస్థ ‘స్పిరిట్ ఎయిర్‌లైన్స్’ తన కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ నిర్ణయంతో శనివారం నుంచే ఆ సంస్థకు చెందిన అన్ని విమాన సర్వీసులు రద్దయ్యాయి. విమానాశ్రయాలకు రావద్దని సంస్థ తన ప్రయాణికులను కోరింది. కస్టమర్ సర్వీస్ సేవలు కూడా నిలిచిపోయాయని వెబ్‌సైట్‌లో పేర్కొన్నప్పటికీ, నేరుగా టికెట్లు కొనుగోలు చేసిన వారికి డబ్బులు రీఫండ్ చేసే ప్రక్రియను త్వరలో ప్రారంభిస్తామని స్పష్టం చేసింది. ఈ క్లిష్ట నిర్ణయంపై సంస్థ అధ్యక్షుడు, సీఈఓ డేవ్ డేవిస్ మాట్లాడుతూ, కంపెనీని కాపాడుకునేందుకు గత మార్చి నెలలో బాండ్ హోల్డర్లతో పునర్వ్యవస్థీకరణ ఒప్పందం కుదుర్చుకున్నా, అకస్మాత్తుగా పెరిగిన విమాన ఇంధన ధరలు పరిస్థితిని చేయిదాటేలా చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యాపారాన్ని కొనసాగించేందుకు అవసరమైన వందల మిలియన్ల డాలర్ల నిధులు లేకపోవడం, కొత్తగా నిధులు సమకూర్చుకునే అవకాశం కూడా లేకపోవడంతో సంస్థను నడపడం అసాధ్యమని

➤ మిగతా 2వ పేజిలో..

## మందుపాతర పేలి
# ముగ్గురు జవాన్ల మృతి

**ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో ఘటన**

కాంకేర్ జనసంఘర్షణ

ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో మావోయిస్టులు పన్నిన మందుపాతర భద్రతా దళాల ప్రాణాలను బలిగొంది. కాంకేర్-నారాయణ్‌పూర్ సరిహద్దుల సమీపంలో శనివారం జరిగిన ఈ ఘోర ప్రమాదంలో ముగ్గురు డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ జవాన్లు దుర్మరణం చెందారు. ఛోటేబెతియా పోలీస్ స్టేషన్‌కు చెందిన భద్రతా దళాల బృందం, మావోయిస్టులు అడవిలో అమర్చిన మందుపాతరలను (ఐఈడీ) గుర్తించి వాటిని తొలగించే ప్రయత్నం చేస్తున్న సమయంలో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇన్‌స్పెక్టర్ సుఖ్రామ్ వట్టితో పాటు కానిస్టేబుల్స్ కృష్ణ కొర్రామ్, సంజరు గఢ్‌పాలేలు అక్కడికక్కడే మరణించినట్లు పోలీసులు ధృవీకరించారు. అదే సమయంలో, ఈ పేలుడులో

➤ మిగతా 2వ పేజిలో..

## రీపోలింగ్‌లోనూ
# భారీ ఓటింగ్

**15 బూతులలో ప్రక్రియ**

కలకత్తా జనసంఘర్షణ

పశ్చిమ బెంగాల్‌లోని సౌత్ 24 పరగణాల జిల్లాలో జరిగిన రీపోలింగ్ ప్రక్రియ భారీ ఓటింగ్ నమోదుతో ముగిసింది. మగ్రహాట్ పశ్చిమ్ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 11 పోలింగ్ కేంద్రాల్లో, అలాగే డైమండ్ హార్బర్ నియోజకవర్గంలోని 4 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 15 బూత్‌లలో శనివారం ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్, సాయంత్రం 6 గంటల వరకు ప్రశాంతంగా కొనసాగింది. ఈ రీపోలింగ్‌లో ప్రజలు అత్యంత ఉత్సాహంగా పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు, ఫలితంగా దాదాపు 90 శాతం ఓటింగ్ నమోదైనట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే, ఉదయం 11 గంటల వరకు సాధారణంగా సాగిన పోలింగ్ ప్రక్రియ, ఆ తర్వాత ఒక్కసారిగా ఉద్రిక్తతలకు దారితీసింది. సౌత్ 24 పరగణాల జిల్లాలోని ఫాల్టా ప్రాంతంలో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) మరియు భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కార్యకర్తల మధ్య ఘర్షణలు చెలరేగాయి. ఓటర్లను పోలింగ్ బూత్‌లకు వెళ్లకుండా టీఎంసీ కార్యకర్తలు అడ్డుకుంటున్నారని బీజేపీ వర్గాలు ఆరోపించగా, ఓటింగ్ ప్రక్రియకు బీజేపీ కార్యకర్తలు ఆటంకం కలిగిస్తున్నారని టీఎంసీ ఎదురుదాడికి దిగింది. ఈ పరిణామాలతో ఫాల్టాలో వాతావరణం వేడెక్కి, స్థానికులు ఆందోళన బాట పట్టారు. టీఎంసీ కార్యకర్తల బెదిరింపులతో తీవ్ర ఆందోళనకు గురైన స్థానిక ప్రజలు, తమకు ప్రాణరక్షణ

➤ మిగతా 2వ పేజిలో..

## ఎన్నికల సంఘం
# కీలక నిర్ణయం

కలకత్తా జనసంఘర్షణ

పశ్చిమ బెంగాల్‌లో ఓట్ల లెక్కింపు ప్రక్రియ సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం అత్యంత కీలకమైన నిర్ణయం తీసుకుంది. ఓట్ల లెక్కింపును అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలనే ఉద్దేశంతో ఈసీ అదనపు పరిశీలకులను రంగంలోకి దింపింది. ముఖ్యంగా ఒకటి కంటే ఎక్కువ కౌంటింగ్ హాళ్లు ఉన్న నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి సారించిన ఎన్నికల కమిషన్, మొత్తం 165 మంది ఎన్నికల పరిశీలకులతో పాటు మరో 77 మంది పోలీసు పరిశీలకులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కౌంటింగ్ కేంద్రాల

➤ మిగతా 2వ పేజిలో..

# ఉద్యోగుల సంక్షేమం పట్ల చిత్తశుద్ధితో ఉన్నాం

**మొదటిపేజీ తరువాయి..** ఒకటో తేదీనే జీతాలు అందేలా చర్యలు తీసుకున్నామని ఆయన గుర్తు చేశారు. ఇకపై ఉద్యోగ సంఘాల ప్రతినిధులు ప్రతి రెండు నెలలకొకసారి సమావేశమై, క్షేత్రస్థాయిలో ఉన్న సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని ఆయన సూచించారు. ఉద్యోగ సంఘాలు తమ ఎన్నికలను ఎటువంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా నిర్వహించుకునే వెసులుబాటును కల్పించామని, అలాగే ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలను కూడా ఎటువంటి వివాదాలకు తావులేకుండా పారదర్శకంగా పూర్తి చేశామని ఆయన వివరించారు. గత రెండేళ్లలో 67,760 ఉద్యోగ నియామకాలను చేపట్టినట్లు గుర్తు చేసిన సీఎం, తమది ఉద్యోగుల పక్షాన నిలిచే స్నేహపూర్వక ప్రభుత్వమని ఉద్ఘాటించారు. ఉద్యోగులకు ఎదురయ్యే ఏ సమస్యలనైనా పరిష్కరించే బాధ్యత పూర్తిగా తమదేనని, ఆ విషయంలో ఉద్యోగులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రేవంత్ రెడ్డి ధైర్యం చెప్పారు.

# ‘ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్’ లోగో ఆవిష్కరణ

**మొదటిపేజీ తరువాయి..** మంత్రి మాట్లాడుతూ, ఇటువంటి వేదికలు యువతకు, వ్యాపారులకు సరికొత్త మార్గాలను సుగమం చేస్తాయని, తద్వారా తెలంగాణ ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ గొప్ప ప్రయత్నాన్ని చేపట్టిన నిర్వాహకులు సందీప్ కుమార్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా తొలి అంతర్జాతీయ మిషన్‌ను సింగపూర్‌లో నిర్వహించేందుకు నిర్వాహకులు ప్రణాళికలు సిద్ధం చేశారు. మే 21 నుంచి 24 వరకు జరగనున్న ఈ పర్యటనలో అంతర్జాతీయ మార్కెట్లపై అవగాహన పెంచుకోవడం, కొత్త వ్యాపార భాగస్వామ్యాలను ఏర్పరుచుకోవడం మరియు అంతర్జాతీయ స్థాయి నెట్‌వర్కింగ్ వంటి అంశాలపై ప్రధానంగా దృష్టి సారిస్తారు. భవిష్యత్తులో ఈ ‘ఎక్స్‌ప్లోర్ టు ఎక్స్‌పాండ్’ సిరీస్‌ను మరింత విస్తరించి, ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో ఇటువంటి మిషన్లను చేపట్టనున్నట్లు వారు వివరించారు. స్థానిక ప్రతిభను ప్రపంచ వేదికలతో అనుసంధానించే బలమైన వంతెనగా పనిచేసే ‘ఇ2ఇ’ వేదిక ద్వారా బిజినెస్ డెలిగేషన్లు, ఎగుమతి ప్రోత్సాహక పర్యటనలు, విద్యార్థుల కోసం అంతర్జాతీయ ఎక్స్‌పోజర్ ప్రోగ్రామ్‌లు, ఇంటర్న్‌షిప్‌లు మరియు వ్యూహాత్మక నెట్‌వర్కింగ్ వంటి సమగ్ర సేవలు అందుబాటులో ఉంటాయి. ఈ అవకాశాలను మనవారు గరిష్టంగా సద్వినియోగం చేసుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు.

# మందుపాతర పేలి ముగ్గురు జవాన్ల మృతి

**మొదటిపేజీ తరువాయి..** మరొక కానిస్టేబుల్ పరమానంద్ కోర్రాకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన తోటి జవాన్లు, క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయనకు వైద్యులు మెరుగైన చికిత్స అందిస్తున్నారు. విధులు నిర్వహిస్తూ వీరమరణం పొందిన జవాన్ల పట్ల సంతాపం వ్యక్తం చేస్తూ, ఈ ఘటనపై పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# రీపోలింగ్‌లోనూ భారీ ఓటింగ్

**మొదటిపేజీ తరువాయి..** కల్పించాలంటూ రోడ్లపైకి వచ్చి నిరసన తెలిపారు. తాము ఓటు వేస్తే తమ ఇళ్లను తగులబెడతారని, రక్తపాతం సృష్టిస్తామని టీఎంసీ వర్గాల నుంచి బెదిరింపులు ఎదురవుతున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులు, అక్కడ నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా అధికారులు వెంటనే స్పందించారు. సీఆర్‌పీఎఫ్ మరియు ఆర్‌పీఎఫ్ బలగాలను భారీగా మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. మరోవైపు, అనుమతి లేకుండానే ఒక స్ట్రాంగ్ రూమ్‌ను తెరిచారన్న ఆరోపణలను బీజేపీ లేవనెత్తింది, దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది. ఈ ఘటనలను ఎన్నికల సంఘం అత్యంత తీవ్రంగా పరిగణించింది. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న టీఎంసీ కార్యకర్తలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని అధికారులను ఆదేశించినట్లు సమాచారం.

# అమెరికాలోనూ ఇంధన సంక్షోభం

**మొదటిపేజీ తరువాయి..** ఆయన వివరించారు.ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికాలో విమాన ఇంధన ధరలు రెట్టింపు కావడం, ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్న స్పిరిట్ ఎయిర్‌లైన్స్‌పై తీవ్ర ప్రభావం చూపింది. 2024 నవంబర్‌లో దివాలా తీసినట్లు ప్రకటించి, పునర్వ్యవస్థీకరణ ద్వారా మళ్లీ పుంజుకోవాలని ప్రయత్నించిన సంస్థకు, ఇప్పుడు ఈ ఇంధన ధరల భారం కోలుకోలేని దెబ్బ కొట్టింది. ఈ క్రమంలో, ట్రంప్ ప్రభుత్వం సంస్థను ఆదుకునేందుకు చివరి ప్రయత్నంగా ఒక ప్రత్యేక రుణాన్ని ప్రతిపాదించినప్పటికీ, అది సఫలం కాలేదని సమాచారం. సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న ఆర్థిక ఇబ్బందులు, ఆపరేషనల్ వైఫల్యాల నేపథ్యంలో, కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేయడం తప్ప మరో మార్గం లేకపోయిందని యాజమాన్యం పేర్కొంది.

# ఎన్నికల సంఘం కీలక నిర్ణయం

**మొదటిపేజీ తరువాయి..** వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా, శాంతిభద్రతలను పటిష్టం చేసేందుకు ఈ పోలీసు పరిశీలకులు నిరంతరం పర్యవేక్షించనున్నారు. లెక్కింపు కేంద్రాల్లోకి ప్రవేశించే విషయంలో కూడా కఠిన నిబంధనలను అమలు చేయాలని నిర్ణయించిన ఈసీ, కేవలం ఈసీఐ నెట్ ద్వారా జారీ చేసిన క్యూఆర్ కోడ్ ఆధారిత ఫొటో గుర్తింపు కార్డులు ఉన్నవారిని మాత్రమే లోపలికి అనుమతించనున్నట్లు స్పష్టం చేసింది.
మరోవైపు, దక్షిణ 24 పరగణాల జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఉన్న 15 పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ఉత్సాహం చూపిస్తుండటంతో, సాయంత్రం 5 గంటల సమయానికే అక్కడ పోలింగ్ శాతం 86 శాతానికి పైగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఇదే సమయంలో, ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత తమకు భద్రత కల్పించాలని కోరుతూ అదే జిల్లాలోని ఫల్తాలో వందలాది మంది ప్రజలు ఆందోళనకు దిగారు. స్థానిక తృణమూల్ కాంగ్రెస్ కార్యకర్తల నుండి తమకు ప్రాణహాని ఉందని, ఫలితాల అనంతరం తమపై దాడులు చేస్తామని బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న సీఆర్పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్, పరిస్థితిని సమీక్షించి ప్రజలకు భద్రతపై హామీ ఇచ్చారు. అయితే, తమపై వచ్చిన ఆరోపణలను స్థానిక టీఎంసీ అభ్యర్థి జహంగీర్ ఖాన్ పూర్తిగా ఖండించారు. ఇదంతా కేవలం భారతీయ జనతా పార్టీ ఆడుతున్న రాజకీయ నాటకమని ఆయన తిప్పికొట్టారు.

# రైతుల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ విఫలం

**మాజీ మంత్రి హరీశ్‌రావు**

రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం కుకునూర్‌పల్లి మండల కేంద్రంలో జరిగిన బీరప్ప ఆలయ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత వంటేరు ప్రతాప్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ నుంచి పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరగా, హరీశ్‌రావు వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం సభనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో సిద్దిపేట జిల్లాలో బీరప్ప దేవాలయం అత్యంత సుందరంగా నిర్మితమైందని గుర్తుచేశారు.

గతంలో గజ్వేల్ ప్రాంతంలో మూగజీవాలకు నీరు, గడ్డి దొరకక రైతులు ఎంతో ఇబ్బంది పడేవారని, కానీ బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కొండపోచమ్మ, మల్లన్నసాగర్ ప్రాజెక్టుల వల్ల ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిందని హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని, కనీసం మూగజీవాలకు నట్టల మందు వేయడం కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికి చేతకావడం లేదని ఆయన ఎద్దేవా చేశారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను గాలికి వదిలేసిందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో రాష్ట్రంలో భూముల ధరలకు రెక్కలు వచ్చి, రియల్ ఎస్టేట్ రంగం ఉత్సాహంగా ఉండగా, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత భూములను కొనేవారు కూడా లేని దుస్థితి నెలకొందని ఆయన ఆరోపించారు.

## ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

**రంగారెడ్డి,మే2 :** మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాదం చోటుచేసుకుంది. డీజిల్ పోసుకొని బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపుతోంది. పోలీసుల వివరాల ప్రకారం.. బతుకుదెరువు కోసం నగరానికి వచ్చిన కుటుంబం.. రెండేళ్లుగా బడంగ్‌పేట్ న్యూ మారుతి నగర్‌లో నివాసముంటోంది. ఈ కుటుంబానికి చెందిన ఓ యువతి గండిపేటలోని ఎంజీఐటీ కాలేజీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. రోజూలాగే కాలేజీకి వెళ్లిన ఆమె ఈ మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చిందని.. ఆ తర్వాత ఇంట్లో ఉన్న డీజిల్‌ను పోసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న వెంటనే మీర్‌పేట్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి సోదరుడు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు గల కారణాలపై విచారణ కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

## సిలిండర్ ధరలు వెంటనే ఉపసంహరించాలి

**కేంద్రానికి సిపిఎం పార్టీ డిమాండ్**

**విజయవాడ, మే2 :** 19 కేజీల వాణిజ్య గ్యాస్ సిలిండర్‌పై పెంచిన 993.50 రూపాయల అదనపు ఛార్జీని తక్షణం ఉపసంహరించుకోవాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పత్రికా ప్రకటనను విడుదల చేశారు. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్ దురాక్రమణ దాడి నేపథ్యంలో ఇప్పటికే ఒకసారి గ్యాస్ ధరలు పెంచి కేంద్ర ప్రభుత్వం వినియోగదారుల నడ్డి విరగ్గొట్టిందని పేర్కొన్నారు. ఇపుడు మరలా అమాంతం దాదాపు మరో వెయ్యి రూపాయలు పెంచి చిన్న వ్యాపారస్తులను, టిఫిన్ సెంటర్లు, చిన్న హోటళ్లను కోలుకోలేని దెబ్బతీస్తుందన్నారు. గ్యాస్ కొరత వలన ఇప్పటికే అనేక హోటళ్లు , టిఫిన్ సెంటర్లు మూతపడ్డాయి లేదా పాక్షికంగా నడుస్తున్నాయని తెలిపారు. ఫలితంగా రాష్ట్రంలో వందలాది మంది ఉపాధి కోల్పోయారని పేర్కొన్నారు. 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల కోసం ఇప్పటివరకు ఆగిన కేంద్ర ప్రభుత్వం మరలా గ్యాస్ రేటు పెంచి వెన్నుపోటు పొడిచిందన్నారు. గ్యాస్ రేట్ల పెంపుదలపై ఎక్కడికక్కడ నిరసనలు తెలియజేయాలని ప్రజలకు సిపిఐ(యం) పిలుపునిచ్చింది. ఈ క్రింది డిమాండ్లపై ప్రజలంతా ఏకమై పోరాడాలని విజ్ఞప్తి చేసింది.

# లారీని ఢీకొన్న మరో లారీ : డ్రైవర్ దహనం

**విజయవాడ, మే2 :** టైర్ పంక్చరై ఆగి ఉన్న లారీని వెనుక నుండి మరో లారీ ఢీకొట్టడంతో లారీ డ్రైవర్ సజీవదహనమయ్యాడు. ఈ ఘటన శనివారం కృష్ణా జిల్లా బాపులపాడు మండలం వీరవల్లి జాతీయ రహదారి చెక్ పోస్టు వద్ద జరిగింది. లారీని మరో లారీ ఢీకొట్టడంతో లారీ డ్రైవర్ సజీవదహనమయ్యాడు. వీరవల్లి ఎస్ ఐ సత్యం సురేష్ తన సిబ్బందితో కలిసి ప్రమాద స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు.

## మనసు పెట్టి చదువు చెప్పండి

**పిల్లలను స్కూళ్లకు వచ్చేలా చేయండి**

**మరో 15ఏళ్లలో పాఠశాలలు మూసుకోవాల్సిందే**

**మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు**

**మంచిర్యాల, మే2 :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోందని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న 15 ఏళ్లలో ప్రభుత్వ పాఠశాలల భవనాలు అద్దెకు ఇచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు ఉద్యోగం సంపాదించడంలో చూపించే శ్రద్ధ 25 శాతం విద్యార్థులకు చదువు చెప్తే మేధావులుగా తయారవుతారన్నారు. ప్రభుత్వ పాఠశాలల పునర్నిర్మానం చేయాల్సిందేనని, విద్యార్థుల కు నైపుణ్యతతో కూడిన విద్య అందించాలని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నారు. నియోజకవ ర్గంలోని ఐదు మండలాలకు చెందిన ప్రధానోపాధ్యాయులకు కుమార్ దీపక్‌తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ, కార్పొరేట్ పాఠశాలల్లో డబ్బులు చెల్లించలేని విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్నారని, విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం కలిగించేలా బాధ్య తాయుతంగా
విద్యను అందించాలన్నారు. డ్యూటీ మైండ్‌తో కాకుండా బాధ్యతతో చదువు చెప్పినప్పుడే నమ్మకం కలుగుతుందన్నారు. విద్యతోనే ఏదైనా సాధించగలమని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి సా రించిందన్నారు. ప్రైవేటు పాఠ శాలల్లో చెప్పే ఉపాధ్యా యుల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు ఎంతో నైపుణ్యం కలిగి ఉంటారన్నారు. నిర్లక్ష్యం, డ్యూటీ మైండ్ సెట్‌తో వెనుబడిపోయాయన్నారు. దౌడపల్లి ప్రభుత్వ పాఠశాలలో 90 మంది విద్యార్థులకు పది మంది ఉపాధ్యాయులు ఉండడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల హాజరు శాతం పెంచేందుకు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. సమీక్ష సమావేశం జరుగుతున్న సమయంలో ప్రధా నోపాధ్యాయులు ముచ్చటించడంపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులకే క్రమశిక్షణ లేనప్పుడు విద్యార్థులకు ఎలా నేర్పుతారని అన్నారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్య కోసం ఖర్చు చేస్తున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ పేర్కొన్నారు. ప్రతీ పాఠశాలకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు డబ్బులు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. అయినప్పటికీ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థు లు ఎందుకు చేరుతున్నారని ప్రశ్నించారు. హాజరుశాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో మేయర్ మధుకర్, డీఈఓ యాదయ్య, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

# రికార్డు స్థాయిలో మత్స్య సంపద: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రూ.250 కోట్ల 'జల సిరి'

కొత్తగూడెం మే 2 (జన సంఘర్షణ)

నీలి విప్లవం దిశగా ఉమ్మడి ఖమ్మం జిల్లా అడుగులు వేస్తోంది. ప్రభుత్వ ప్రోత్సాహం, సమృద్ధిగా కురిసిన వర్షాలతో ఈ ఏడాది చెరువులు 'జల నిధి'గా మారి, సుమారు రూ.250 కోట్ల విలువైన 25 వేల టన్నుల చేపల దిగుబడితో మత్స్యకారుల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయి.

**ప్రకృతి కరుణ.. ప్రభుత్వ తోడ్పాటు**

గతంలో చేపల పెంపకం కేవలం కొన్ని వర్గాలకే పరిమితమయ్యేది. కానీ ఇప్పుడు ఉమ్మడి జిల్లాలోని ప్రతి చెరువు ఒక ఆదాయ వనరుగా మారింది. ప్రభుత్వమే ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేయడం, సకాలంలో వర్షాలు కురవడంతో చెరువులు జలకళను సంతరించుకున్నాయి. ఇది కేవలం చేపల దిగుబడి మాత్రమే కాదు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన ఊతం. ఒకప్పుడు వల వేస్తే కేవలం పూట గడిచే పరిస్థితి నుంచి, నేడు క్వింటాళ్ల కొద్దీ దిగుబడి సాధించే స్థాయికి మత్స్యకారులు చేరుకున్నారు.


**సరిహద్దులు దాటుతున్న ఖమ్మం చేప**

ఇక్కడ పడుతున్న చేపలు కేవలం స్థానిక మార్కెట్లకే పరిమితం కావడం లేదు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల నుంచి ప్రతిరోజూ టన్నుల కొద్దీ చేపలు హైదరాబాద్, తమిళనాడు, కోల్‌కతా వంటి ప్రాంతాలకు ఎగుమతి అవుతున్నాయి. నాణ్యతలో రాజీ లేకపోవడంతో ఇతర రాష్ట్రాల వ్యాపారులు నేరుగా చెరువుల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ఇది స్థానిక మత్స్యకారులకు గిట్టుబాటు ధరను అందించడమే కాకుండా, జిల్లా బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుతోంది.

**ఉపాధి వేటలో స్థిరత్వం**

ఈ భారీ దిగుబడి వెనుక వేల సంఖ్యలో మత్స్యకార కుటుంబాల శ్రమ దాగి ఉంది. సుమారు 25 వేల టన్నుల లక్ష్యాన్ని చేరుకోవడం అంటే అది సామాన్య విషయం కాదు. దీనివల్ల వలలు అల్లడం నుంచి, చేపలను పట్టుకోవడం, రవాణా చేయడం, విక్రయించడం వరకు ప్రతి దశలోనూ వందలాది మందికి ఉపాధి లభిస్తోంది.






ముఖ్యంగా యువత ఈ రంగాన్ని ఒక గౌరవప్రదమైన వృత్తిగా స్వీకరించడం శుభపరిణామం.

**మత్స్యకారులకు లభిస్తున్న ప్రయోజనాలు**

ప్రభుత్వం మత్స్యకారుల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. ప్రమాద బీమా సౌకర్యం కల్పించడం వల్ల మత్స్యకారుల కుటుంబాలకు భరోసా లభిస్తోంది. అలాగే సబ్సిడీపై ద్విచక్ర వాహనాలు, లగేజీ ఆటోలు అందించడం ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా తమ ఉత్పత్తులను మార్కెట్‌కు తరలించుకునే వీలు కలిగింది. ఇది వారి నికర ఆదాయాన్ని గణనీయంగా పెంచుతోంది.

**ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలు**

చేపల అమ్మకాల ద్వారా మత్స్యకార మహిళలు కూడా ఆర్థికంగా బలోపేతమవుతున్నారు. మహిళా సహకార సంఘాల ద్వారా రుణాలు పొంది, విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇంటి వద్దే ఉంటూ గౌరవప్రదమైన సంపాదన పొందడం వారి సామాజిక హోదాను పెంచింది. పిల్లల చదువులు, ఆరోగ్య అవసరాలకు ఈ ఆదాయం ప్రధాన వనరుగా మారుతోంది.

**భవిష్యత్తు సవాళ్లు - పరిష్కారాలు**

దిగుబడి పెరిగినప్పటికీ, నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజ్ సౌకర్యాలు మరిన్ని పెరగాల్సిన అవసరం ఉంది. ఆధునిక సాంకేతికతను జోడించి చేపల ప్రాసెసింగ్ యూనిట్లను జిల్లాలోనే ఏర్పాటు చేస్తే మత్స్యకారులకు ఇంకా ఎక్కువ లాభం చేకూరుతుంది. ఈ దిశగా అడుగులు పడితే, ఉమ్మడి జిల్లా మత్స్య రంగం రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

- నేల పరీక్ష చేయించాలి
- యూరియా వినియోగం తగ్గించాలి

బోధన్ : మే 02 జన సంఘర్షణ

రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా వేల్పూర్ మండల కేంద్రంలోని రామన్నపేట్ గ్రామ పంచాయతీ కార్యాలయం లో శనివారం ఉదయం ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధన స్థానం రుద్రూర్ శాస్త్రవేత్తలు వ్యవసాయ శాఖ సమన్వయంతో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎం. సాయి చరణ్, కీటక శాస్త్రవేత్త మాట్లాడుతూ... రైతులందరు తప్పనిసరిగా నేల పరీక్షలు చేయించుకోవాలని, అవసరం మేరకే యూరియా వినియోగించి పంట సాగు ఖర్చు తగ్గించుకోవాలని సూచించారు. యూరియా అధిక వాడకం వల్ల పంటలలో రసం పీల్చే పురుగులు, వరి లో సుడి దోమ, బాక్టీరియా ఎండాకు తెగులు ఉధృతి అధికమవుతుందని తెలిపారు. పొలంలో కాండం తొలుచు పురుగు యొక్క ఉధృతి ఆర్థిక పరిమిత స్థాయిని దాటినప్పుడు మాత్రమే రసాయన మందులు వినియోగించాలని, చీడ పీడల నుండి రక్షించడం కోసం కేవలం రసాయన మందుల్ని విచక్షణారహితంగా పిచికారి చేయకుండా సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించాలని సూచించారు. బి. రాజు, వ్యవసాయ అధికారి, పంటకి సాగు నీరు అవసరం మేరకు అందించాలని, రైతులు సేంద్రియ పద్ధతులను ఉపయోగించి ఆరోగ్యకరమైన దిగుబడులను పొందవచ్చని తెలిపారు. బి. రాజు ఉద్యాన అధికారి, ఆయిల్ పామ్ సాగు అవశ్యకత ను, అధిక రసాయనాల వాడకం ద్వారా కలిగే ఆరోగ్య సమస్యల ను గురించి ఉద్యాన శాఖ అందిస్తున్న పలు పథకాలను గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్. వైష్ణవ్, వ్యవసాయ అధికారి, షబ్బీర్, యు. ప్రశాంత్, విస్తరణ అధికారులు, బి. నవీన్- సర్పంచ్, శ్రీనివాస్- రెడ్డీస్ ఫౌండేషన్, శోభన్ రెడ్డి, కోఆపరేటివ్ సొసైటీ మాజీ చైర్మన్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.





# ఇల్లందులో ప్రజా పాలన సమావేశం - రూ.3.26 కోట్లు పంపిణీ

- పేదల అభ్యున్నతే లక్ష్యం - ఉచిత సంక్షేమ పథకాలపై ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పష్టం

ఇల్లెందు ప్రతినిధి( జన సంఘర్షణ)

ఇల్లందు నియోజకవర్గంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ స్థాయి సమావేశం బొజ్జాయిగూడెం గ్రామ పరిధిలోని ఎస్‌ఎస్ గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికిఎమ్మెల్యే కోరం కనకయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రోగ్రామ్ స్పెషల్ ఆఫీసర్, జిల్లా డీఆర్‌డీఏ విధ్యాచందన కూడా పాల్గొన్నారు. సమావేశంలో నియోజకవర్గంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు, వాటి వ్యయాలపై అధికారులు సంక్షిప్త వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా వ్యవసాయం, డ్రగ్స్ నిర్మూలనపై వాల్ పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అంగనవాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేసి, మహిళా స్వయం సహాయక సంఘాలు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. అలాగే 41 మహిళా సంఘాలకు రూ.3.26 కోట్ల చెక్కును అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..పేదల అభ్యున్నతికి కట్టుబడి ఉన్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు. సన్నబియ్యం, ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు, వడ్డీ లేని రుణాలు వంటి పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల ఇంటి కలను నెరవేర్చుతున్నామని, గ్రామాల అభివృద్ధికి సీసీ, బీటీ రోడ్లు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఇల్లందులో 100 పడకల ఆసుపత్రి నిర్మాణం జరుగుతుండగా, ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. రైతులు సేంద్రియ వ్యవసాయం, ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించాలని సూచిస్తూ, ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలని ప్రజా ప్రతినిధులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మున్సిపల్ చైర్మన్ దొడ్డా కిరణ్, వైస్ చైర్మన్ డానియేల్, పెండేల రాజు, మంగిలాల్ నాయక్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.




# 60వేల మంది చిన్నారుల హెల్త్ ట్రాకింగ్

కొత్తగూడెం మే 2 (జన సంఘర్షణ)

భద్రాద్రి జిల్లాలోని 2,061 అంగన్‌వాడీ కేంద్రాల్లోని 60 వేల మంది చిన్నారుల ఆరోగ్య వివరాలను జిల్లా సంక్షేమ శాఖ ఆన్‌లైన్‌లో నమోదు చేసింది. శనివారం రామవరం మాతా శిశు ఆసుపత్రిలో జరిగిన 'బాల భరోసా' కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి (డీడబ్లుఓ) స్వర్ణలత ఈ వివరాలను వెల్లడించారు.ఆర్‌బీఎస్‌కె బృందాల ద్వారా చిన్నారుల్లో అనారోగ్య సమస్యలను ముందస్తుగానే గుర్తిస్తున్నారు. 'న్యూట్రిషన్ హెల్త్ ట్రాకింగ్ సిస్టమ్' పోర్టల్‌లో ప్రతి చిన్నారి సమాచారాన్ని భద్రపరిచారు. మొత్తం 42 రకాల ప్రశ్నలతో కూడిన డేటా ఆధారంగా చిన్నారుల ఆరోగ్య స్థితిగతులను పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ పిల్లలందరికీ మెరుగైన పోషకాహారం, వైద్యం అందించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.



## అభివృద్ధి బాటలో పాల్వంచ: 5వ డివిజన్‌లో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం

ఇల్లందు మే 2 (జన సంఘర్షణ)

మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పాల్వంచ మున్సిపాలిటీ మరో ముందడుగు వేసింది. 5వ డివిజన్ కాంట్రాక్టర్స్ కాలనీలో చిరకాల వాంఛగా ఉన్న సీసీ రోడ్డు నిర్మాణానికి కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్ ఘనంగా శంకుస్థాపన చేశారు. కేవలం శిలాఫలకాలకే పరిమితం కాకుండా, ప్రజా జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా సాగుతున్న ఈ ప్రయత్నం స్థానికుల్లో కొత్త ఆశలు చిగురింపజేస్తోంది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. సంక్షేమంతో పాటు సౌకర్యాల కల్పనలో రాజీ పడే ప్రసక్తే లేదని, ప్రతి డివిజన్‌ను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. డిప్యూటీ మేయర్ లలిత కుమారి, కార్పొరేటర్లు ఆడుసుమిల్లి సాయిబాబా, వీసంశెట్టి విశ్వం, నూకల సరిత మరియు స్థానిక నాయకుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమం, పాలకుల సంకల్పానికి, ప్రజల సహకారానికి ప్రతీకగా నిలిచింది. ఒక ప్రాంత పురోభివృద్ధి కేవలం కాంక్రీటు నిర్మాణాల్లో లేదు, ఆ నిర్మాణం సగటు మనిషి ప్రయాణాన్ని ఎంత సులభతరం చేస్తుందనే దానిపైనే ఆధారపడి ఉంటుందని ఈ వేడుక గుర్తుచేసింది.



## అగ్నిప్రమాదంలో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఇల్లెందు ప్రతినిధి (జన సంఘర్షణ)

ఇల్లందు: ఇల్లందు మండలం ఒడ్డుగూడెం గ్రామపంచాయతీలో జరిగిన అగ్నిప్రమాదంలో మొక్కజొన్న పంటలు దగ్ధమై నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని భారత రాష్ట్ర సమితి నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జరిగిన ఈ అగ్నిప్రమాదంలో తీవ్ర నష్టం వాటిల్లిన పంటలను పార్టీ నాయకులు మాజీ సహకార వ్యవసాయ సంఘం ఉపాధ్యక్షుడు బండారి శ్రీనివాస్, చల్లసముద్రం గ్రామ సర్పంచ్ ఏపే శంకర్, ఉప సర్పంచ్ గుగ్గిళ్ల నరేష్, చల్లసముద్రం మాజీ మండల పరిషత్ సభ్యురాలు పూనెం లింగమ్మ, యువ నాయకులు భూక్య సురేష్, అయిలు నారాయణ గౌడ్, సోలం జనార్ధన్, బానోత్ బనిషా, గుగ్గిళ్ల పవన్ తదితరులు పరిశీలించారు. అనంతరం బాధిత రైతులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆరుగాలం కష్టపడి పండించిన మొక్కజొన్న పంట చేతికొచ్చే సమయంలో అగ్నిప్రమాదంలో కాలిపోవడం రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒడ్డుగూడెం గ్రామపంచాయతీలో నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే సహాయం అందించి, వారి కుటుంబాలకు భరోసా కల్పించాలని వారు కోరారు.



## మంత్రి పొంగులేటిని కలిసిన ఎమ్మెల్యే పాయం

భద్రాచలం మే 2 (జన సంఘర్షణ)



భద్రాచలం పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని శనివారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మర్యాదపూర్వకంగా కలిశారు. ఐటీసీ (బీపీఎల్) క్రాస్ రోడ్ వద్ద మంత్రికి, ఎంపీ బలరాం నాయక్‌కు ఎమ్మెల్యే ఘనస్వాగతం పలికారు. అనంతరం వారికి శాలువా కప్పి ఆత్మీయంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై వారితో చర్చించారు. నాయకుల రాకతో క్రాస్ రోడ్ వద్ద సందడి నెలకొంది.

## ఆరేపల్లి గ్రామంలో సిసి కెమెరాల ఏర్పాటు

మాచరెడ్డి, మే 2 ( జన సంఘర్షణ )

కామారెడ్డి జిల్లా,ఆరేపల్లి గ్రామంలో గ్రామస్తుల సహకారంతో ఏర్పాటుచేసిన 16 సీసీ కెమెరాలు కామారెడ్డి రూరల్ సిఐ, మాచారెడ్డి పోలీస్ సిబ్బంది కలిసి ప్రారంభించడం జరిగినది. ఇట్టి సందర్భంగా మాచారెడ్డి, పాల్వంచ మండల ప్రజలకు తెలియజేయునది ఏమనగా ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానం. కాబట్టి మిగతా గ్రామస్తులు కూడా ఈ విధంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాల్సిందిగా మనవి. ఇట్టి కార్యక్రమంలో కామారెడ్డి రూరల్ సిఐ, శ్రీధర్ గౌడ్, మాచారెడ్డి ఎస్ఐ అనిల్, మాచారెడ్డి పోలీస్ సిబ్బంది, ఆరెపల్లి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, పంచాయతి సెక్రటరీ, గ్రామస్తులు పాల్గొన్నారు.




జన సంఘర్షణ
ఆదివారం 03 మే 2026

# ఇసుక ఆన్లైన్ కోసం లబ్ధిదారుల నుంచి అధిక మొత్తంలో దండుకుంటున్న మీసేవ కేంద్రాలు

❑ ఒక్కొక్కరి వద్ద 150 నుంచి 200 రూపాయల వరకు

నిజామబాద్/మే 2/(జన సంఘర్షణ)
ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం అవసరమైన ఇసుక గతంలో రెవెన్యూ కార్యాలయంలో వే బిల్లు చెల్లిస్తే ట్రాక్టర్ ఇసుక అనుమతులు ఇచ్చేవారు. దీనివల్ల తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక అక్రమ దోపిడీకి కొనసాగుతుందని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచించి ఇంద్రమ్మ నిర్మించుకుంటే వారు ఆన్లైన్ 14 రూపాయలు చెల్లిస్తే ఇసుక తీసుకువెళ్లడానికి అనుమతిస్తారు. రవాణా చార్జీలు లబ్ధిదారులే భరించవలసి ఉంటుంది. దీనివల్ల అక్రమంగా ఇసుక బయటకు వెళ్లకుండా అడ్డుకట్ట వెడానికి ఈ పద్ధతి ప్రభుత్వం తీసుకువచ్చింది. కొంతమంది అవగాహన ఉన్నవారు ఫోన్లోనే ఆన్లైన్ ఇసుక బుకింగ్ చేసుకునే అవకాశం ఉంది. ఈ ఆన్లైన్ బుకింగ్ తెలియని చాలామంది లబ్ధిదారులు మీసేవ కేంద్రాలకు తరలిపోతున్నారు. అక్కడ కేవలం ఆన్లైన్ కోసం 14 రూపాయలు తీసుకొని వారి ఖర్చులు ఏమైనా ఉంటే తీసుకోవచ్చు. ఇలా కాకుండా ఆన్లైన్లో కోసం ఒక్కొక్కరి నుంచి 150 రూపాయలు నుంచి 200 రూపాయల వరకు వస్తువులు చేస్తున్నారు మీ సేవ కేంద్రం నిర్వాకులు. ముఖ్యంగా నిజామాబాద్ జిల్లాలోని వర్ని, చందూర్, మోస్రా,రుద్రూర్ మండలాల్లోని కొన్ని మీసేవ కేంద్రాలు ఆన్లైన్ ఇసుక కోసం అప్లోడ్ చేయడానికి 150 రూపాయలు నుంచి 200 రూపాయలు వసూలు చేస్తున్నారు. వాస్తవానికి ప్రభుత్వానికి ఆన్లైన్ ద్వారా 14 రూపాయలు చెల్లించి, మీసేవ ఖర్చులు 10 నుంచి 15 రూపాయల వరకు చెల్లించవచ్చు. అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకొని కొంతమంది మీ సేవ నిర్వాహకులు, కంప్యూటర్ ఆపరేటర్లు పెద్ద ఎత్తున దోపిడికి పాల్పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి మీసేవ కేంద్రాల్లో కొనసాగుతున్న ఈ అవినీతికి అడ్డుకట్ట వేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.




# మోడి సభను భారీ జనసమీకరణతో విజయవంతం చేయాలి

❑ బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్

హైదరాబాద్ సిటిబ్యూరో /మే 2( జనసంఘర్షణ )
ఈ నెల మే 10వ తేదీన నగరానికి విచ్చేస్తున్న మన ప్రియతమ భారత ప్రధాని నరేంద్ర మోడీ కి భారీ జన సమీకరణతో ఘన స్వాగతం పలికి, జన ఆగ్రహ సభ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్. గాంధీనగర్ డివిజన్ అశోక్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్ ప్రాంగణంలో మోడీ సభ సన్నాహక సమావేశం డివిజన్ బిజెపి అధ్యక్షుడు వి.నవీన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు.ముఖ్య అతిథిగా డివిజన్ ఇన్చార్జి కె.నాగేశ్వర్ రెడ్డి, బిజెపి సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్ పాల్గొన్నారు.సమావేశంలో బిజెపి బూత్ అధ్యక్షులు, మహిళా నాయకులు,అన్ని మోర్చల అధ్యక్షులు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు. ఆదివారం మే 10 వ తేదీన సాయంత్రం 4:00 గంటలకు, సికింద్రబాద్ లోని పెరెడ్ గ్రౌండ్స్ మైదానంలో జరగబోయే “జన ఆగ్రహ సభ” కు ప్రధాని శ్రీ నరేంద్ర మోది విచ్చేయానున్న సందర్భంగా గాంధీనగర్ డివిజన్ నుండి భారీ జన సామీకరణతో బయలుదేరి వెళ్లి మోడీకి ఘన స్వాగతం పలికి, సభలో పాల్గొనాలని సమావేశంలో నాయకులకు కార్యకర్తలకు తెలిపారు. సమావేశంలో బిజెపి డివిజన్ ప్రధాన



కార్యదర్శులు శ్రీనివాస్, ఆనంద్ రావు, సీనియర్ నాయకులు రత్న సాయి చంద్, శ్రీకాంత్, దామోదర్, ఎం.ఉమేష్, శివ కుమార్, సత్తి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సీపీఎం నాయకురాలు శకుంతల మృతి

❑ పాడే మోసిన జిల్లా కార్యదర్శి రమేష్ బాబు
❑ ఎర్రజెండా కప్పి నివాళులు అర్పించిన పార్టీ నేతలు

పోతంగల్ /మే 2/(జన సంఘర్షణ)
సీపీఎం పోతంగల్ గ్రామ పార్టీ మహిళా నాయకురాలు కామ్రేడ్ నేనావత్ శకుంతల శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. శనివారం ఆమె స్వగ్రామం పోతంగల్ లో అంత్యక్రియలు నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు పార్టీ నేతలు శకుంతల పార్థివ దేహంపై ఎర్రజెండా కప్పి నివాళులు అర్పించారు. రమేష్ బాబుతో పాటు పార్టీ నేతలు పాడే మోశారు. ఈ సందర్భంగా రమేష్ బాబు మాట్లాడుతూ.. మంజీరా నది పరివాహక ప్రాంతంలో ప్రభుత్వ భూములను పేద ప్రజలకు పంపిణీ చేయాలని పాలకులపై పోరాటం చేసి, సాగు భూములు సాధించిందన్నారు. పోతంగల్ మండల కేంద్రంలో నిరుపేదలకు ఇండ్ల స్థలాల కోసం నిరుపేదలను ఏకం చేసి, పోరు నడిపి సుమారు 120 మందికి ఇండ్ల స్థలాలు ఇప్పించిన పోరాట వనిత అని కొనియాడారు. వ్యవసాయ కూలీలకు కూలీ రేట్లు పెంచాలని వారం రోజులపాటు సమ్మె చేసి భూస్వాములు కూలీ రేట్లు పెంచే విధంగా ఎర్రజెండా చేతబట్టి ముందుకు సాగిందన్నారు. పోరాటానికి మారుపేరు కామ్రేడ్ శకుంతల అని ఆమె ఆశయ సాధనకు కార్యకర్తలు కృషి చేయాలని అయన పిలుపునిచ్చారు. అంత్యక్రియల్లో సీపీఎం ఏరియా కార్యదర్శి నన్నేసాబ్, జిల్లా కమిటీ సభ్యులు యేశాల గంగాధర్, సీనియర్ నాయకులు గంగాధరప్పా, శంషుద్దీన్ నాయకులు బొౖర సత్యనారాయణ, నాగనాథ్, సాయ గౌడ్, రాములు, ముత్తయ్య, తదితరులు హాజరయ్యారు.






# సుధాకర్‌కు నివాళులు - కుటుంబానికి ఆర్థిక సాయం

❑ పేదలకు అండగా ఉండాలి - వీరన్న పిలుపు

సింగరేణి ప్రతినిధి( జన సంఘర్షణ)



కారేపల్లి మండల పరిధిలోని అప్పయగూడెం గ్రామానికి చెందిన వట్టం సుధాకర్ ఇటీవల మృతి చెందగా, శనివారం ఆయన దశదిన కార్యక్రమంలో స్థానిక నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే రాములు నాయక్ ఆదేశాల మేరకు, ఆయన అనుచరుడు, మాజీ మండల ప్రధాన కార్యదర్శి అజ్మీరా వీరన్న కొంత ఆర్థిక సాయాన్ని గ్రామ పెద్ద ఈసం విష్ణు చేతుల మీదుగా మృతుని భార్య మంగా చేతికి అందజేశారు.ఈ సందర్భంగా వీరన్న మాట్లాడుతూ.. పేద కుటుంబాలకు అండగా నిలబడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. జర్నలిస్టుగా, రాజకీయ నాయకుడిగా తన వంతు సహాయం చేస్తున్నానని తెలిపారు. ఈ మండలంలో పుట్టినందుకు గర్వంగా ఉందని, పేదలకు సహాయం చేయడంలో సంతృప్తి ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యం, రామ్మూర్తి, రామరావు, నాగేంద్రబాబు, వాంకుడోత్ విజయ్, భూక్యా రాంకీ తదితరులు పాల్గొన్నారు.

# మోదీ మార్క్ బాదుడు.. ప్రజా పోరాటమే శరణ్యం: సిపిఐ(ఎం) నేత నర్సారెడ్డి

భద్రాచలం మే 2 (జన సంఘర్షణ)



అమరజీవి గుండ్ల బాబురావు సంస్మరణ సభ శనివారం అశోక్ నగర్ కాలనీలో సిపిఐ(ఎం) వార్డు కమిటీ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బి. నర్సారెడ్డి, బాబురావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ముగియగానే మోదీ ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచి సామాన్యులపై భారాలు మోపిందని మండిపడ్డారు. బాబురావు నిరుపేదల సమస్యల పరిష్కారం కోసం, కార్మిక వర్గ సంక్షేమం కోసం నిరంతరం పోరాడారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితో ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పెట్రోల్, డీజిల్ ధరలు కూడా పెంచేందుకు కేంద్రం సిద్ధమైందని, దీనిపై పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సభకు పారెల్లి సంతోష్ కుమార్ అధ్యక్షత వహించగా, పార్టీ నాయకులు రౌతు గణపతి, బాబురావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# న్యాయమే ఊపిరిగా.. ఇల్లందు ప్రిన్సిపల్ జడ్జిగా స్వరూప బాధ్యతల స్వీకారం!”

ఇల్లందు ఏప్రిల్ 02 (జన సంఘర్షణ)



ఇల్లందు పట్టణ ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జిగా కాటం స్వరూప శనివారం బాధ్యతలు స్వీకరించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి బి. రవికుమార్ నుంచి ఆమె ఈ బాధ్యతలను స్వీకరించగా, బార్ అసోసియేషన్ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె చేసిన వ్యాఖ్యలు కేవలం సంప్రదాయబద్ధమైనవి కావు, ఆలోచింపజేసేవిగా ఉన్నాయి–“బార్ అండ్ బెంచ్” అనేవి ఒకే నాణేనికి రెండు పార్శ్వాలని, ఈ రెండింటి మధ్య సమన్వయం ఉన్నప్పుడే సామాన్యుడికి త్వరితగతిన న్యాయం అందుతుందని ఆమె నొక్కి చెప్పారు. వ్యవస్థలో సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావాలని కోరడం ద్వారా, ఆమె పారదర్శకతకు, బాధ్యతాయుతమైన న్యాయపాలనకు పెద్దపీట వేశారు. కోర్టు మెట్లు ఎక్కిన ప్రతి కక్షిదారుడి ఆశ న్యాయం మాత్రమే కాదు, ఆ న్యాయం సరైన సమయంలో అందాలనే ఆకాంక్షను ఈ కొత్త నియామకం నెరవేరుస్తుందని ఆశిద్దాం.

# ప్రజా పాలన - ప్రగతి సంతకం: ఇల్లందు సంక్షేమ పథకాల్లో సరికొత్త వేగం!

ఇల్లందు మే 2 ( జన సంఘర్షణ)




ఇల్లందు నియోజకవర్గ గడప గడపకూ ప్రజా ప్రభుత్వ ఫలాలు అందడమే లక్ష్యంగా ‘ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక’ సభ సామాన్యుడి ఆత్మగౌరవాన్ని చాటిచెప్పింది. ఎమ్మెల్యే కోరం కనకయ్య నేతృత్వంలో జరిగిన ఈ నియోజకవర్గ స్థాయి సమావేశం కేవలం గణాంకాల వివరణకే పరిమితం కాకుండా, ప్రభుత్వ చిత్తశుద్ధికి అద్దం పట్టింది. సుమారు రూ.3.26 కోట్ల రూపాయల భారీ నిధులను స్వయం సహాయక సంఘాల మహిళలకు అందజేయడం, అంగన్‌వాడీలకు సాంకేతికతను (స్మార్ట్ ఫోన్లు) జోడించడం వంటి చర్యలు క్షేత్రస్థాయి మార్పుకు నాంది పలుకుతున్నాయి. “ప్రభుత్వం ఖర్చు చేసే ప్రతి రూపాయి పేదవాడి కన్నీరు తుడవడానికే” అన్న ఎమ్మెల్యే వ్యాఖ్యలు అధికారుల్లో బాధ్యతను పెంచేలా ఉన్నాయి. ముఖ్యంగా 100 పడకల ఆసుపత్రి, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ వంటి మౌలిక వసతుల కల్పనతో పాటు, రైతాంగాన్ని ఆయిల్ పామ్ వంటి లాభసాటి పంటల వైపు మళ్ళించడం నియోజకవర్గ భవిష్యత్తుపై గట్టి భరోసానిస్తోంది. అయితే, ఈ పథకాలు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా ప్రతి ఇంటికీ చేరవేయాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉందని గుర్తుచేస్తూ, ఈ సమావేశం అభివృద్ధికి ఒక దిక్సూచిలా నిలిచింది.

# లైబ్రరీలో సందడి.. గ్రంథపాలకురాలికి ఘన సన్మానం!

కొత్తగూడెం మే 2 (జన సంఘర్షణ)



అన్నపురెడ్డిపల్లి ఆలయ చైర్మన్ నరసింహారావు ఈరోజు జిల్లా కేంద్ర గ్రంథాలయాన్ని సందర్శించి, గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబును మర్యాద పూర్వకంగా కలిశారు. అన్నపురెడ్డి పల్లిలో త్వరలో జరగనున్న ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవానికి రావాలని ఆయనకు ఆహ్వాన పత్రికను అందజేశారు. అనంతరం గ్రంథాలయంలోని వసతులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయంలోని ఏర్పాట్లపై విద్యార్థులు ప్రశంసలు కురిపించడంతో, అక్కడ విధులు నిర్వహిస్తున్న గ్రంథపాలకురాలు మణిమృదులను నరసింహారావు ప్రత్యేకంగా అభినందించారు. తీవ్రమైన ఎండలోనూ విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేస్తున్న ఆమెను చైర్మన్ వీరబాబు సమక్షంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ గౌరవానికి మణిమృదుల కృతజ్ఞతలు తెలిపారు.


# పోతంగల్ గ్రామ శివారులో ట్రాన్స్ఫారం ధ్వంసం



పోత్తంగల్/మే 2(జన సంఘర్షణ)
నిజమాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలోని, గ్రామ శివారులో రైతు గంధపు హనుమడ్లు పొలంలో గత 2 రెండు రోజుల క్రితం ట్రాన్స్ఫారాన్ని ధ్వంసం చేసి కాపర్ కాయలు, ఆయిల్, కాపర్ తీగలు దొంగలించినట్టు విద్యుత్ శాఖకు చెందిన అధికారులు తెలపడం జరిగింది. రైతు మాట్లాడుతూ విద్యుత్ శాఖ వారికి నిర్లక్ష్యం ఉంది , అని రైతు తెలిపాడు. ఎందుకంటే 2 రోజుల క్రితం ఘటన జరిగింది విద్యుత్ శాఖ అధికారులకు ఫోన్ ద్వారా తెలపడం జరిగింది. అయినా పట్టించుకోకపోవడం వల్ల పత్రిక విలేకరులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలానికి వెళ్లడం జరిగింది.

## మద్నూర్ పట్టణంలోని భవ్య చారిత్రాత్మక శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి రథోత్సవ వేడుకలలో పాల్గొన్న జుక్కల్ ఎమ్మెల్యే

మద్నూర్/మే 2/(జన సంఘర్షణ)



శనివారం మద్నూర్ పట్టణంలోని భవ్య చారిత్రాత్మక శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి రథోత్సవ వేడుకలలో పాల్గొన్న జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజల సుఖసంతోషాలు, శ్రేయస్సు కోసం ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులతో కలిసి రథోత్సవాన్ని వీక్షిస్తూ, వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## పోలీస్ స్టేషన్ భవనం పైనుంచి దూకి యువతి ఆత్మహత్యాయత్నం



- జిల్లా ఆస్పత్రికి తరలింపు
- ప్రేమ పేరుతో మోసం చేసిన యువకుడు

నిజామాబాద్/మే 2/(జన సంఘర్షణ)

ముందే పెళ్లి జరిగింది కానీ తనకు పెళ్లి జరగలేదని మరొక యువతితో ప్రేమగా పడ్డాడు, చివరికి ప్రేమ పెళ్లి చేసుకోవడానికి సిద్ధమయ్యారు. చివరి సమయంలో తనతో పెళ్లి చేసుకుంటున్న యువకుడు ముందే పెళ్లి జరిగిందని తెలుసుకొని మన స్థానానికి గురై పోలీస్ స్టేషన్ భవనం నుంచి దూకి ఆత్మహత్యాయత్నం పాల్పడిన నిజామాబాద్ జిల్లా బాల్కొండలో పోలీస్ స్టేషన్లో చోటుచేసుకుంది. బాల్కొండ కి చెందిన సాయికుమార్ తో ప్రేమలో ఉన్న యువతి. అంతకుముందే తనకు పెళ్లి అయిందన్న విషయాన్ని దాచిపెట్టిన సాయికుమార్. మోసం చేసిన సాయికుమార్ పై ఫిర్యాదు చేసేందుకు బాల్కొండ పోలీస్ స్టేషన్ కు వచ్చిన యువతి. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇచ్చి భవనం ఎక్కి ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. తీవ్ర గాయాలకు గురైన యువతిని నిజామాబాద్ ఆసుపత్రికి తరలించరు.

## గత ప్రభుత్వంలో డబుల్ బెడ్రూం లేదు

- ఈ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇల్లు రాలే
- పక్షవాతం వచ్చి మంచం పట్టా అయినా పెన్షన్ లేదు



రుద్రూర్/మే 2/(జన సంఘర్షణ)

గత ప్రభుత్వం హయాంలో డబుల్ బెడ్ రూమ్ రాలే ఈ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇల్లు కూడా రాలే, పక్షవాతం వచ్చి మంచం పట్టా ఇప్పటికీ పెన్షన్ లేదు బతకాలి. ఎలా గత 50 నుంచి 60 సంవత్సరాల అవుతుంది. రేకుల షెడ్డులో నివాసం ఉంటున్న తన గురించి పట్టించుకునే నాధులు కరువయ్యారు, 47 సంవత్సరాలు గా కాంగ్రెస్ పార్టీలో జెండా మోస్తూ కార్యకర్తగా పనిచేస్తున్న, అయినా నాగోడు వినదెవరు గూడు కట్టించేది ఎవరు, పెన్షన్ ఇచ్చేది ఎవరు, నాకు న్యాయం జరిగేది ఎప్పుడూ.. అని బండారి లింగం తన గోడును మీడియాకు విన్నవించడం జరిగింది. ఇప్పటికైనా న్యాయం చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కోరటం జరిగింది.

## సులేమాన్ ఫారం జిపిలో పంచాయతీ కార్మికురాలిగా పని చేయించుకున్నారు అనంతరం మోసం చేశారు

- జీతం డబ్బులు ఇస్తలేరు న్యాయం చేయండి ఇప్పుడు నాకు జీతం నుంచి తొలగించారు



రుద్రూర్సులేమాన్ ఫారం /మే 2/(జన సంఘర్షణ)

నిజామాబాద్ జిల్లా రుద్రూరు మండలం సులేమాన్ ఫారం గ్రామంలో జిపి కార్మికురాలిగా పనిచేసే శివమ్మకు జీపీలోని కొంతమంది అన్యాయం చేశారని, పని చేయించుకుని మోసం చేయడం జరిగిందని, ఒక నెల జీతం కూడా ఇవ్వలేదని తనకు న్యాయం చేయాలని, జిపి కార్మికురాలు శివవ్వా తన గోడును విన్నవించింది. అవసరం ఉన్నప్పుడు తనతో పని చేయించుకొని అవసరం తీరినాక తనకు జిపి నుంచి పని చేయకుండా తొలగించారని అన్నారు. ప్రస్తుతం పని లేక పస్తులు ఉంటున్నామని తనకు న్యాయం చేయాలని జీతం డబ్బులు ఇప్పించాలని తెలిపింది.

# అందరి భాగస్వామ్యంతోనే సత్వర ప్రగతి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- విజయవంతమైన నియోజకవర్గ స్థాయి సభలు

బోధన్: మే 02 జన సంఘర్షణ



అభివృద్ధి కార్యక్రమాలలో అన్ని వర్గాల వారు భాగస్వాములు అయినప్పుడే సత్వర ప్రగతి సాధ్యమవుతుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శనివారం బోధన్ పట్టణం ఆచన్ పల్లిలోని ఏ.ఆర్ గార్డెన్ లో శనివారం నిర్వహించిన బోధన్ నియోజకవర్గ సభలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, మున్సిపల్ చైర్ పర్సన్ పద్మ శరత్ రెడ్డి పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి సందేశాన్ని చదివి వినిపించారు. పంట రుణాల మాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకం, గృహ జ్యోతి, చేయూత పథకం, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు, కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, సన్న ధాన్యంకు బోనస్ చెల్లింపు తదితర వాటి ద్వారా లబ్ది పొందిన వారి వివరాలు చదివి వినిపించారు. పలువురు లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల తమకు చేకూరిన ప్రయోజనాల గురించి సభలో తమ అనుభవాలను తెలియజేస్తూ, రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మునుముందు అమలు చేయనున్న పథకాల గురించి ప్రజలకు తెలియజేస్తూ, రాష్ట్ర ప్రగతి, సంక్షేమంలో వారిని భాగస్వామ్యం చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం “ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక” కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని అన్నారు. అందరి అభిప్రాయాలను క్రోడీకరించి సమగ్ర అభివృద్ధి కోసం ప్రణాళిక రూపొందించడానికి, సమస్యల పరిష్కారానికి ఈ సభలు దోహదపడతాయని అన్నారు. ప్రభుత్వం రైతు భరోసా పథకం, ఇందిరమ్మ ఇండ్లు, మహాలక్ష్మి పథకం, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ. 500/-కి గ్యాస్ సిలిండర్, గృహ జ్యోతి (200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్), కళ్యాణలక్ష్మి / షాదీ ముబారక్, చేయూత పథకం కింద పెన్షన్ లు వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని, లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయడం జరుగుతోందని అన్నారు. ఇంకనూ అర్హులు మిగిలి ఉంటే మున్సిపల్, ఎంపీడీఓ కార్యాలయాలలో ప్రజా పాలన సేవా కేంద్రాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగిన వారికి ఆయా పథకాల ద్వారా లబ్ది చేకూర్చడం జరుగుతుందని భరోసా కల్పించారు. ఇందిరమ్మ ఇళ్ళ మంజూరీ తెలుపబడిన లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. వివిధ దశల ఇంటి నిర్మాణ స్థితిని లబ్ధిదారులు వారే స్వయంగా సెల్ఫ్ ఫోటో క్యాప్చరింగ్ ద్వారా ఇందిరమ్మ వెబ్ సైట్ లో అప్లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించారని గుర్తు చేశారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. త్వరలోనే ప్రభుత్వం రెండవ విడత కింద లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేయనుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం, అంగన్వాడీ నుండి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అల్పాహార పథకాన్ని త్వరలో అమలు చేయనుందని వివరించారు. ప్రొపెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం విజయవంతానికి అంకిత భావంతో కృషి చేయాలని, బడి బయటి పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని అన్నారు. ప్రభుత్వం విద్యా రంగానికి ఎనలేని ప్రాధాన్యతనిస్తోందని, ఇందులో భాగంగానే ఇటీవలే బోధన్ శివారు బెల్లాల్ లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి



శంకుస్థాపన చేయడం జరిగిందని కలెక్టర్ గుర్తు చేశారు. రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం, మొక్కజొన్న సేకరణ జరుపుతున్నామని అన్నారు. ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మొక్కజొన్న పంట కోల్పోయిన బాధిత రైతులకు పరిహారం అందజేయబడుతుందని తెలిపారు. సర్వైకల్ క్యాన్సర్ నిరోధం కోసం ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న వ్యాక్సిన్ ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత వేసవిలో ఆరోగ్య పరిరక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని హితవు పలికారు. జిల్లాలో అన్ని నివాస ప్రాంతాలకు తాగునీటి సరఫరా సక్రమంగా జరిగేలా పకడ్బందీ పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. కాగా, ఇసుక అక్రమ రవాణాను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, ఇసుక అవసరం ఉన్న వారు మన ఇసుక వాహనం ఆన్లైన్ బుకింగ్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మున్సిపల్ చైర్ పర్సన్ పద్మ శరత్ రెడ్డి మాట్లాడుతూ... బోధన్ పట్టణంలోని అన్ని వార్డులలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి ఎనలేని సహకారం అందిస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ ద్వారా కమిషన్ రూపంలో సమకూరిన రూ.3.80 కోట్ల చెక్కును మహిళా సంఘాలకు పంపిణీ చేశారు. అదేవిధంగా ఐసిడీఎస్ ద్వారా వంద అంగన్వాడీ కేంద్రాల నిర్వాహకులకు సెల్ ఫోన్లు అందజేశారు. ముగ్గురు లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కు పంపిణీ చేశారు. ఈ సభలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, డీడబ్ల్యూఓ పద్మ, ఏసీసి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలో అమ్మకు అక్షర మాల కార్యక్రమం

ఎల్లారెడ్డి, మే -2(జన సంఘర్షణ )




ఎల్లారెడ్డి మున్సిపాలిటీలో శనివారం “అమ్మకు అక్షర మాల” కార్యక్రమం అక్షరాస్యతపై అవగాహన సదస్సు నిర్వహించాడం జరిగిందని మున్సిపల్ మేనేజర్ వాసంతి అన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి మహిళల అక్షరాస్యత ఎంతో అవసరమని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా 18 సంవత్సరాల నుండి 60 సంవత్సరాల మధ్య వయస్సు గల ప్రతి మహిళకు అక్షర జ్ఞానం ఉండేలా ప్రభుత్వం ప్రత్యేకంగా “అమ్మకు అక్షరాభ్యాసం” కార్యక్రమాన్ని అమలు చేస్తోందని వివరించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు అక్షరాస్యత ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పించారు. మహిళలు చదువు నేర్చుకుంటే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతుందని, ప్రభుత్వ పథకాలను సులభంగా వినియోగించుకోగలరని తెలిపారు. కార్యక్రమంలో దుర్గ, శోభ రాణి పాల్గొని మహిళలకు అక్షరాస్యతపై ప్రేరణాత్మకంగా అవగాహన కల్పించారు.

## ప్రతి సోమవారం ఎల్లారెడ్డి ఆర్డీఓ కార్యాలయంలో ప్రజావాణి

ఎల్లారెడ్డి, మే -2(జన సంఘర్షణ )



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతీ సోమవారం డివిజన్ స్థాయి ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎల్లారెడ్డి ఆర్డీవో ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయిలో విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. అయితే ప్రజల సత్వర పరిష్కారం కోసం ప్రస్తుతం ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని రెవిన్యూ డివిజన్ స్థాయికి విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.ప్రభుత్వం డివిజన్ స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించాలని తీసుకున్న నిర్ణయం మేరకు ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని డివిజన్ స్థాయి అధికారులు ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి సమస్యలు, వినతులు స్వీకరించి వాటిని సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాబట్టి డివిజన్ పరిధిలోని ప్రజలు ఈ ప్రజావాణి కార్యక్రమం సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో కోరారు.

## సాలూరు మండలంలో సిఐటియు సిపిఐ(ఎం) పార్టీ ఘనంగా మేడే వారోత్సవాలు

బోధన్ : మే 02 జన సంఘర్షణ

మేడే వారోత్సవాలు సందర్భంగా సిఐటియు సిపిఐ ఎం పార్టీ సాలూరు మండలంలో బోధన్ మండలం ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. సాలూరు మండల కేంద్రంలో సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యంలో. గ్రామపంచాయతీ కార్మిక సంఘం మండల నాయకులు విజయ్ పటేల్. సిఐటియు జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. బోధన్ మండల ఏ రాజు పెళ్లి గ్రామంలో.. బోధన్ డివిజన్ కమిటీ సభ్యులు కుప్రియాల బాలయ్య, సిపిఐ ఎం పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. ఊటుపల్లి గ్రామంలో సిపిఎం పార్టీ బోధన్ మండల నాయకులు దండు సాయిలు పార్టీ జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. సిఐటియు జెండాను ఊట్పల్లి గ్రామంలో సిపిఎం పార్టీ శాఖ కార్యదర్శి నాయకురాలు సుంకరి లక్ష్మి జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది. సాలూరు మండలం బోధన మండలం. సిఐటియు జెండాలు.. పార్టీ జెండాలు ఆవిష్కరణ సందర్భంగా. సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఏశాల. గంగాధర్ నాయకత్వన జరిగినవి.. ఆ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు కొనసాగిస్తూ వామపక్ష పార్టీలు, కార్మికులు, కర్షకులు, ప్రజలు పోరాటాలు చేసి సాధించిన హక్కులను కాలరాస్తూ కార్మిక ప్రజల పక్షాన కాకుండా ప్రభుత్వాలు పెట్టుబడుదారుల పక్కా పక్షాన నిలబడుతూ కేవలం ఎన్నికలలో కార్మికులకు, ప్రజలకు అనేక హామీలు ఇస్తూ పార్టీలు, ప్రభుత్వాలు.. తమ ఇచ్చిన హామీని ప్రజల పైన, కార్మికుల పైన భారాలు వేస్తూ కాలయాపన చేస్తూ పరిపాలన చేస్తున్నాయి. వీటిని ఎదుర్కోవడానికి దేశవ్యాప్తంగా ప్రజలు పేద ప్రజలు ఐక్యమైపోరాటాలు నిర్వహించి తమ హక్కుల కోసం నిలబడి వామపక్ష పార్టీల ప్రభుత్వాలను ఎన్నికలలో తమ ఓట్లను వేసి గెలిపించుకొని తమ సమస్యల పరిష్కరించడం పరిష్కరించుకోవడమే మన ముందున్న ఏకైక మార్గం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మిక సంఘం సాలూరు మండలం నాయకులు పి రాజి. రామారావు, సతీష్, శంకర్, గంగారాం, మారయ్య, సక్కుబాయి, లక్ష్మి, భూమవా, సాయవ్వ, స్వరూప, నల్ల సాయిలు, ఆ సరే లింగం, బోయి మదర్, రాజు, రాములు, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.





# అట్టహాసంగా సాగిన పేర్నాటి జన్మదిన వేడుకలు

◆ **600 పైచిలుకు యువకులు స్వతహాగా రక్తదానం**

కోట మే 2 (జన సంఘర్షణ )

నెల్లూరు జిల్లా కోట మండలం విద్యానగర్ బాలభారతి స్కూలు ఆవరణలో శనివారం వైయస్సార్ పార్టీ అగ్రనేత సీఈసీ సభ్యులైన పేరునాటి శ్యాం ప్రసాద్ రెడ్డి జన్మదిన వేడుకలు అట్టహాసంగా జరిగింది. విద్యానగర్ నుండి కోట క్రాస్ రోడ్డు వరకు పలువురు అభిమాన నాయకులు ఫ్లెక్సీలు దర్శనమిచ్చాయి. పేరునాటి చారిటబుల్ ట్రస్ట్ స్థాపకుడు, అధ్యక్షులైన పేర్నాటి శ్యాం ప్రసాద్ రెడ్డి నిలువెత్తు కటౌట్ సూపరులను ఆకట్టుకుంది. పలువురు అభిమానులు బాణ సంచాలతో ఆయనకు సాదర స్వాగతం పలికారు. భారీ గజమాలలతో వారికున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో రెడ్ క్రాస్ మెడిప్లస్ బ్లడ్ సెంటర్, నోవా బ్లడ్ తదితర సంస్థల వారు ఈ శిబిరంలో పాల్గొని 600 మంది పైచిలుకు యువకుల నుండి రక్తాన్ని సేకరించారు. వీరంతా శ్యాం ప్రసాద్ రెడ్డి మీద ఉన్న అభిమానంతోనే స్వతహాగా ముందుకు వచ్చి రక్తదానం చేయడం జరిగింది. ఈ సందర్భంగా శ్యాం ప్రసాద్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ పేర్నాటి చారిటబుల్ ట్రస్ట్ 2001 వ సంవత్సరం ప్రారంభించామని అప్పటినుండి రక్తదాన శిబిరాలు పలు క్యాంపులు పెట్టామని ,ఆపదలో ఉన్నవారికి రక్తమిచ్చి పలు ప్రాణాలు కాపాడవచ్చు అన్నారు. ఆయన సతీమణి, కుమార్తె, బంధువులు కూడా ఈ శిబిరంలో రక్తదానం చేయడం జరిగింది.తనకేంతో ఈ శిబిరాలు నిర్వహించడంలో సంతృప్తి చెందామన్నారు. భవిష్యత్తులో మరెన్నో సేవా కార్యక్రమాలు ట్రస్టు ద్వారా చేయనున్నట్లు ఆయన తెలిపారు. నన్ను అభిమానించేప్రజల బలమే నా బలం అన్నారు. 53 లో నుండి 54వ సంవత్సరంలో అడుగుడుతున్న నాకు ప్రజల బలమే నా భవిష్యత్తు ప్రణాళికలని ఆయన చెప్పారు. కడవరకు వైయస్సార్ పార్టీ నాయకుడైన జగన్మోహన్ రెడ్డి తోనే నా ప్రయాణం అన్నారు. ఈ కార్యక్రమానికి విచ్చేసి నన్ను ఆశీర్వదించిన ప్రతి ఒక్కరికి తానంతో రుణపడి



ఉంటాను అన్నారు. వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆశ్రయం కల్పించిన బాల భారతి స్కూల్ యాజమాన్యానికి ఆయన తన కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అయిన పలగాటి సంపత్ కుమార్ రెడ్డి, పార్టీ నాయకులు రాధాకృష్ణారెడ్డి, సాయి కృష్ణారెడ్డి, ఎన్నమాల వెంకటాద్రి, ఉప్పల ప్రభాకర్, పాముల సురేంద్ర, మహిళా నేత రేష్మ, జరుగుమల్లికి చెందిన ఉలస కసూరయ్య యాదవ్, గోవిందపల్లి పాలెం మత్స్యకార గ్రామానికి చెందినకాపులు, యువత, తిరుపతి జిల్లా వాకాడు మండలం కొండూరు పాలెం మత్స్యకారుల గ్రామానికి చెందిన కాపులు, కోట వాకాడు చిట్టమూరు చిల్లకూరు మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ శ్రేణులు కార్యకర్తలు అశేషంగా పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ జగన్మోహన్ రెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటాం

◆ **కలెక్టర్, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ ల హామీ**

వీకోట, మే 2 (జన సంఘర్షణ )

వీకోట పట్టణం నందు మార్నింగ్ వాక్ చేస్తున్న జర్నలిస్ట్ జగన్ మోహన్ రెడ్డిని రౌడీ షీటర్ తమిమ్ హతమార్చడంతో ఆ కుటుంబాన్ని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎంపీ దుగ్గిమల్ల ప్రసాద్ బాబు లు పరామర్శించారు. జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి నివాళు లర్పించి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.బాధిత కుటుంబానికి అన్ని విధాల ప్రభుత్వం సహకరిస్తుందని, తప్పనిసరిగా న్యాయం జరుగుతుందన్నారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టే వారిని సహించేది లేదని ఆయన అన్నారు. వికోట పట్టణంలోని టిడిపి నేతలు,ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులు బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం, ప్రభుత్వ ఉద్యోగం, పిల్లల విద్యాభ్యాసం కోసం ఫీజుల చెల్లింపుకు సహకరించాలని కోరగా, జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించి కార్యాచరణ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు . ఇద్దరు పిల్లలు విద్యాభ్యాసానికి అయ్యే ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని జగన్ భార్య అంజలికి హామీ ఇచ్చారు. అవసరమైన అన్ని చర్యలు చేపడతామన్నారు. బాధిత కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇస్తామన్నారు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సీఎం సహాయ నిధి నుండి ఆర్థిక సాయం అందిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. కళాశాల ల నందునాలుగు సంవత్సరాలకు ఎంత ఫీజు చెల్లించాలో అక్కడినుండి కొటేషన్లు పంపిస్తే ఆ మేరకు ఫీజు చెల్లింపబడుతుందన్నారు .జగన్మోహన్ రెడ్డి కుటుంబానికి తప్పనిసరిగా న్యాయం జరుగుతుందని, ఎటువంటి ఆందోళన చెందవద్దని, చట్టం పని చట్టం చేస్తుందని ఇందులో ఎటువంటి సందేహం అవసరం లేదన్నారు. గతంలో జరిగిన కొన్ని సంఘటన నందు సైతం శాంతి కొరకు మంచి ప్రయత్నాలు చేశాడని, అతని గురించి ఎంతైనా మాట్లాడొచ్చు అన్నారు. సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిని ప్రభుత్వం విడిచి పెట్టేది లేదని సాధ్యమైనంత తొందరగానే ఆ కుటుంబానికి న్యాయం జరుగుతుందన్నారు. పత్రికా మిత్రులు ఆ కుటుంబానికి ఇచ్చిన హామీలు నెరవేరే వరకు తనను కలుస్తూ ఉండాలని ఆయన కోరారు.ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఎమ్మెల్యే మురళీమోహన్, ఎం పి వ్యక్తిగతంగా బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పూతలపట్టు ఎమ్మెల్యే వ్యక్తిగతంగా బాధిత కుటుంబానికి 50వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. జగన్మోహన్ రెడ్డి తనకు గత 20 సంవత్సరాలుగా ఒక మిత్రుడుగా, పత్రికా విలేకరిగా సుపరిచితుడని ఆయన అన్నారు. ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి కి ఈ సంఘటనపై పూర్తి సమాచారం అందించామని, ఆ కుటుంబాన్ని ఆదుకుందామని సి ఎం పేర్కొన్నారని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి జర్నలిజం నందు హుందాగా వార్తలు



రాసేవాడని, భవిష్యత్తు చాలా ఉండేదని, ఇలా అర్ధాంతరంగా ముగిసిపోతుందని ఏనాడు ఊహించలేదని, ఇలా మాట్లాడేందుకే చాలా బాధాకరంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం నందు ఇలాంటి సంఘటన జరక్కుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అధికారులకు ఆదేశాలు వెళ్లాయన్నారు.మీడియా మిత్రులు నిర్భయంగా వార్తలు రాయాలని, అంతకులపై పిడి యాక్ట్ నమోదు చేస్తామని, ఎవరు భయపడవద్దని, అధికార యంత్రాంగ మీ వెనుక ఉంటుందన్నారు. వీరి వెంట జిల్లా దేశం పార్టీ ఉపాధ్యక్షులు రామచంద్ర నాయుడు, రాష్ట్ర వేర్ హౌస్ డైరెక్టర్ ఏఎం రంగనాథ్, మండల పార్టీ అధ్యక్షులు రాంబాబు నాయుడు, అధికారులు, పలువురు నేతలు ఉన్నారు.

# వెంకయ్య స్వామి సేవలో వెంకయ్య నాయుడు, సోమిరెడ్డి

◆ **భగవాన్ శ్రీ వెంకయ్య స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల నిర్వహణ.**

◆ **ఆశ్రమ ప్రాంగణం మొత్తాన్ని సందర్శించి అభివృద్ధితో పాటు సంక్షేమ కార్యక్రమాల అమలును తెలుసుకున్న వెంకయ్య నాయుడు**

◆ **వెంకయ్య నాయుడు కామెంట్స్.**

మనుబోలు. 2.5.2026 (జన సంఘర్షణ )

సర్వేపల్లి నియోజకవర్గం వెంకటాచలం మండలంలోని గొలగమూడిని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ముందుగాఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ..అందరూ భాగస్వాములైన చక్కటి ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం ఆనందాన్ని ఇచ్చిందని మాజి ఉప రాష్ట్ర పతి వెంకయ్య నాయుడు అన్నారు. శనివారం వెంకయ్య స్వామి ఆశ్రమ సందర్శన సందర్భంగా నా మనస్సు చాలా నిర్మలంగా ఉంది. ఈ ఆశ్రమాన్ని సందర్శించి, ఇక్కడ జరుగుతున్న ఆధ్యాత్మిక, విద్య, వైద్య కార్యక్రమాలను స్వయంగా పరిశీలించడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఎలాంటి ప్రతిఫలం లేకుండా ఆశ్రమ బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఈఓ బాలసుబ్రహ్మణ్యంకు అభినందనలు. ఈ మట్టిలో పుట్టిపెరిగిన నాకు వెంకయ్య స్వామిని స్వయంగా చూసే అవకాశం లభించింది. నా చిన్నతనంలో స్కూలుకెళ్లే సమయంలో శ్రీరామపురంలో వెంకయ్య స్వామి పర్యటించేవారు. పల్లెటూళ్లో పుట్టిపెరిగిన నాకు ప్రభుత్వ స్కూళ్లలో చదివి జీవితంలో అంచెలంచెలుగా ఎదిగి దేశంలోనే రెండో అత్యున్నత పదవిని అధిరోహించే అవకాశం లభించింది. ప్రభుత్వ స్కూళ్లలో వసతులు మెరుగుపడ్డాయి...ప్రతి తల్లిదండ్రులు తమ బిడ్డలను ప్రభుత్వ స్కూళ్లలో చదివించాలి జీవితంలో ప్రతి ఒక్కరూ సేవా భావంతో మెలగాలి..కష్టాల్లో ఉన్న తోటివారికి చేతనైన సాయం చేయాలి. సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తక్కువ వయస్సులో ఎక్కువ అనుభవం సంపాదించి ప్రజాసేవలో కొనసాగుతున్నారు.



**సోమిరెడ్డి కామెంట్స్.**

భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి జీవిత చరిత గ్రంథాన్ని ఆవిష్కరించే కార్యక్రమంలో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నాను .ప్రజల ఆరాధ్య దైవం వెంకయ్య స్వామి ఆశ్రమం నేను ప్రాతినిధ్యం వహిస్తున్న సర్వేపల్లిలో ఉండటం నాకు దక్కిన మహద్భాగ్యం. టీటీడీ జేఈఓగా అపారమైన సేవలు అందించిన విశ్రాంత ఐఏఎస్ అధికారి బాలసుబ్రహ్మణ్యం ఆశ్రమ ఈఓగా అంకిత భావంతో పనిచేస్తున్నారు. ఏడాదికి 10 లక్షల మందికి అన్నప్రసాదం అందించడం గొప్ప విషయం. విద్య, వైద్యం పరంగా ఆశ్రమం ఆధ్వర్యంలో ఎనలేని సేవలు అందిస్తున్నారు. వందలాది మంది ఉచితంగా విద్యాభ్యాసం చేస్తున్నారు. పెద్దాయన వెంకయ్య నాయుడు చొరవతో అనేక జాతీయ స్థాయి సంస్థలు మన సర్వేపల్లి నియోజకవర్గంలో కొలువయ్యాయి. స్వర్ణభారత్ ట్రస్ట్ ద్వారా పేదలు సేవలు అందించడంలో దీపా వెంకట్ ఎప్పుడూ ముందుంటారు..వెంకయ్య స్వామి ఆశ్రమ కమిటీ సభ్యురాలిగానూ సేవలు అందిస్తున్నారు. భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని కోరుకుంటున్నాను


దీపా వెంకట్ కామెంట్స్

భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి జీవితచరిత్ర గ్రంథ ఆవిష్కరణలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉంది. ఇది సాక్షాత్తు భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి ఇచ్చిన అవకాశంగా భావిస్తున్నాను

రాజకీయాలకు అతీతంగా భగవాన్ శ్రీ వెంకయ్య స్వామి ఆశ్రమం అభివృద్ధి చెందుతోంది. ఆశ్రమ కమిటీలో నన్ను కూడా భాగస్వామిని చేసి వెంకయ్య స్వామితో పాటు భక్తులకు సేవ చేసే అవకాశం కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఈదూరు రామ్మోహన్ రెడ్డి, దువ్వూరు రాధాకృష్ణారెడ్డి, సన్నపురెడ్డి సురేష్ రెడ్డి, తుంగా శివప్రభాత్ రెడ్డి, ఆదిశేషారెడ్డి, కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి బొమ్మి సురేంద్ర, కుంకాల దశరథనాగేంద్ర ప్రసాద్, గ్రామ నాయకులు తదితరులు.

## రుద్రూరు గ్రామపంచాయతీ ఎదుట మాజీ వార్డ్ సభ్యులు అమురు భాయ్ నిరసన

రుద్రూర్/మే 2/(జన సంఘర్షణ)



నిజామాబాద్ జిల్లా రుద్రూరు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఎదుట మాజీ వార్డు సభ్యులు అమ్మురు బాయి నిరసన చేశారు. గ్రామపంచాయతీ అధికారులు గతంలో తప్పుడు ధృవపత్రాలు ఇచ్చి తమ ప్రమేయం లేకుండా తమకు అన్యాయం చేశారని తన గోడును వెళ్ళబుచ్చాడు. తన సోదరిని సతీమణి ఉపసర్పంచ్గా గతంలో చేసి ఉన్నప్పుడు తన సోదరుడు తమకు తీవ్రంగా అన్యాయం చేయడం జరిగిందని అన్నారు. సోదరుడు కలీం కురేసి తమపై రౌడిజం చేయడం వల్ల సుమారు 8 సంవత్సరాల నుంచి గ్రామం వదిలి పెట్టి వెళ్లిపోవడం జరిగిందని ఆయన తెలిపారు. తనకు న్యాయం జరిగేంత వరకు తన ఆందోళన కొనసాగిస్తూనే ఉంటా అంటూ హెచ్చరికలు చేశారు.

## మైనార్టీ గురుకుల పాఠశాలలో 5వ తరగతి దరఖాస్తు ఆహ్వానం

ఎల్లారెడ్డి, మే -2 (జన సంఘర్షణ )

పట్టణంలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహమ్మద్ షరీఫ్ తెలిపారు. నాన్ మైనారిటీ విభాగంలో 5వ తరగతిలో ప్రవేశాల కోసం అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. 5వ తరగతిలో ప్రవేశాల కోసం..అదేవిధంగా మైనారిటీ విభాగంలో 5వ తరగతి నుంచి 8వ తరగతి వరకు మైనార్టీ విద్యార్థులు అప్లయ్ చేసుకోవచ్చన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు పాఠశాలలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు. ఈనెల 7న లాటరీ పద్ధతిలో సీట్ల కేటాయింపు జరుగుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. మరిన్ని వివరాలకు 9490863874, 9014630770 నంబర్లలో లేదా పని వేళల్లో పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

## కూటమి ప్రభుత్వంలో రైతులకు సంక్షేమ పథకాలు లబ్ధి

◆ **ఏఎంసి డైరెక్టర్ పవన్ కుమార్**

రామకుప్పం మే 2 (జన సంఘర్షణ )



కూటమి ప్రభుత్వ పాలనలో రైతులకు అన్ని రకాల సంక్షేమ పథకాలు లబ్ధి చేకూరుతున్నట్లు ఏఎంసీ డైరెక్టర్ పవన్ కుమార్ పేర్కొన్నారు. శనివారం పెంచనబల్ల సింగ సముద్రం పంచాయతీ పరిధిలోనున్న రైతులకు చాప్ సగం కట్టర్లను సగం సబ్సిడీతో పదిమంది రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఎంసి డైరెక్టర్ మాట్లాడుతూ రైతులకు కావలసిన పథకాలను సకాలంలో కూటమి ప్రభుత్వం వివిధ పథకాలను పంపిణీ చేసినట్లు చెప్పారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలక్కుండా సకాలంలో స్పందించడం పట్ల రైతాంగం నుండి సంతృప్తి వ్యక్తం అవుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పట్టణాలైనా చారి కూటమనేతలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యాధి నిరోధిక టీకాలు తప్పనిసరిగా వేయించుకోండి

రామ్ కుప్పం మే 2 (జన సంఘర్షణ )



ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోవాలని వైద్యాధికారులు పూజిత సాయి శ్రీలు పేర్కొన్నారు. శనివారం విజాలాపురం ప్రాథమిక ఆరోగ్య వైద్య కేంద్ర పరిధిలోనున్న వంశి గాని పల్లి గ్రామాల్లో వ్యాధి నిరోధక టీకాలు, గర్భవతులకు పోషక ఆహారం గురించి వివరించడం జరిగింది. పిల్లలకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయడం వలన కొన్ని ప్రాణాంతక వ్యాధులు నుండి క్షయ పచ్చకామర్ల కోరింత దగ్గు తదితర వ్యాధులనుండి పిల్లలను కాపాడుకోవచ్చు ని సూచించారు. గర్భవతులకు మంచి పోషక పదార్థాలు కలిగి ఉన్న ఆహారములను తీసుకుంటే రక్తహీనత రాదని వివరించారు. మారుతున్న వాతావరణ పరిస్థితుల్లో వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎ బాలు హెచ్, ఈ ప్రమీల, ఏఎన్ఎంలు గ్లోరీ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ ఫలితాలు

శ్రీకాళహస్తి మే 02 (జన సంఘర్షణ ) :

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నట్లు శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగినేని చెంచయ్య నాయుడు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రెడ్డి వారి గురవారెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్, జడ్పిటిసి వెంకటసుబ్బారెడ్డి లు సంయుక్తంగా అన్నారు. 36 మండలాలు 36 రోజులు - బడి పిలుస్తోంది ఇంటింటికీ ప్రచార రథం ఎన్రోల్మెంట్ డ్రైవ్ 8వ రోజు శనివారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో అనుభవం అర్హత కలిగిన ఉపాధ్యాయులు బోధన అందించడంతో పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఉచిత విద్యా బోధనతో పాటు పాఠ్యపుస్తకాలు సమవస్త్రాలు స్కూల్ బ్యాగ్, షూ, సాక్స్, నోట్ పుస్తకాలు, డిక్షనరీ, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, తల్లికి వందనం, ఐఎ పి ప్యానెల్స్ ద్వారా డిజిటల్ విద్యాబోధన అందిస్తున్నట్లు తెలిపారు.

# డి.ఎస్ కాలనీలో కలుషిత నీటి సమస్య - స్పందించిన కాంగ్రెస్ నేత బండి రమేష్





**మే 02,2026,బాలానగర్,హైదరాబాద్**

బాలానగర్ డివిజన్ పరిధిలోని డి.ఎస్ కాలనీలో గత కొన్ని రోజులుగా కలుషితమైన మంచినీరు వస్తుందని కాలనీ వాసులు ఆందోళన వ్యక్తం చేయడంతో బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మట్టే ప్రసన్నకుమార్ వెంటనే స్పందించి కూకట్పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్ గారికి సమాచారం ఇవ్వగా. శనివారం రోజున ఉదయం అధికారులతో ఫోన్లో మాట్లాడిన బండి రమేష్ ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లే ఈ సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కోరారు. స్పందించిన వాటర్ వర్క్స్ మేనేజర్ అనిల్ కుమార్, డి.ఎస్ కాలనీకి సిబ్బందిని పంపించి నీటి శాంపిల్స్ సేకరించి, పైప్లైన్ లీకేజీలను గుర్తించే పనులు ప్రారంభించారు. క్లోరినేషన్ పెంచి, సురక్షితమైన తాగునీరు అందించేందుకు చర్యలు చేపడతామని మేనేజర్ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా మట్టే ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, "ప్రజా సమస్యల పరిష్కారమే కాంగ్రెస్ పార్టీ ధ్యేయం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తాం. కలుషిత నీటితో ప్రజలు అనారోగ్యం పాలు కాకూడదు. అధికారులు 24 గంటల్లో సమస్యను పూర్తిగా పరిష్కరించాలి" అని అన్నారు. కాంగ్రెస్ నేత కూకట్పల్లి నియోజకవర్గం ఇంచార్జ్ బండి రమేష్ తక్షణ స్పందనపై డి.ఎస్ కాలనీ వాసులు

# దీపాయంపల్లిలో అంగన్వాడి పిల్లలకు ఇంటికే ఆహార పంపిణీ.

**దౌల్తాబాద్ మే 2**



దౌల్తాబాద్ మండలం దీపాయంపల్లి అంగన్వాడి కేంద్రంలో మే నెల సెలవులు ఉన్న నేపథ్యంలో గ్రామ సర్పంచ్ దుర్గేష్ ఆధ్వర్యంలో పిల్లలకు ఆహార పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సెలవుల కారణంగా అంగన్వాడి కేంద్రం మూసివేసినప్పటికీ, పిల్లల పోషణలో ఎటువంటి అంతరాయం కలగకుండా ఇంటికే ఫుడ్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దుర్గేష్ మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం అందించే పోషకాహారం ప్రతి లబ్ధిదారుడికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గ్రామంలో ప్రతి అర్హులైన పిల్లలకు ఆహారం అందించడమే లక్ష్యమని చెప్పారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## ఆలేరులో యూత్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశం.

**యాదాద్రి భువనగిరి జిల్లా:**




**మే 02/ఆలేరు:**

ఆలేరు పట్టణ కేంద్రంలోని ఇందిరా కాంగ్రెస్ భవన్లో యూత్ కాంగ్రెస్ ఆలేరు నియోజక వర్గ అధ్యక్షులు మంగ కిరణ్ ఆధ్వర్యంలో శనివారం యూత్ కాంగ్రెస్ ఎగ్జిక్యూటివ్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా యూత్ కాంగ్రెస్ తెలంగాణ ఇంచార్జ్ భవ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ,తెలంగాణలో యూత్ కాంగ్రెస్ను బలోపేతం చేయడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. యువతను పార్టీ వైపు ఆకర్షించేందుకు విస్తృత కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యకలాపాలను గ్రామ స్థాయికి విస్తరించి,యువతను నాయకత్వంలోకి తీసుకురావడం ప్రధాన లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ యాదాద్రి జిల్లా అధ్యక్షులు మంగ ప్రవీణ్,ఆలేరు మండల అధ్యక్షులు బండపల్లి మహేష్,వలపు రమేష్,శ్రవణ్ రెడ్డి,నర్సి రెడ్డి,సురేష్,పర్వే నరేష్,కోరుటూరి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# పోచమ్మ అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలి : దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి.

**- దొమ్మాటలో పోచమ్మ అమ్మవారి పునః ప్రతిష్టా మహోత్సవం.**







**దౌల్తాబాద్ మే 2**

దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామంలో శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ అమ్మవారి పునః ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ మహోత్సవంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యా లతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. గ్రామ ప్రజలు ఐక్యంగా సంప్రదాయాలను కాపాడుతూ దేవాలయ అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంజయ్య, బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు సయ్యద్ రహిమోద్దిన్, మాజీ సర్పంచ్ కొమ్మెర పూజిత వెంకటరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సింహాచలం, బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు నర్ర రాజేందర్, ఏఎంసి మాజీ డైరెక్టర్ పబ్బ అశోక్ గుప్తా,ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామస్తులు, మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# దొమ్మాటలో పోచమ్మ తల్లి విగ్రహా పునః ప్రతిష్ఠాపన మహోత్సవం.





**దౌల్తాబాద్ మే 2**

మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు దౌల్తాబాద్ మండలం దొమ్మాట గ్రామంలో నిర్వహించిన పోచమ్మ తల్లి అమ్మవారి విగ్రహ పునః ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించగా, గ్రామస్తులు భారీగా హాజరై భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో గ్రామానికి సుఖశాంతులు, అభివృద్ధి కలగాలని ఎంపీ ఆకాంక్షించారు. గ్రామాభివృద్ధికి తాను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంజయ్య, బిజెపి నాయకులు,ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

## దౌల్తాబాద్లో ముదిరాజ్ యువసేన ఆధ్వర్యంలో రాగి జావ అంబలి పంపిణీ.





**దౌల్తాబాద్ మే 2**

దౌల్తాబాద్ మండల కేంద్రంలో ముదిరాజ్ యువసేన ఆధ్వర్యంలో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాగి జావ అంబలి పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పోషకాహారానికి ప్రాధాన్యతనిస్తూ నిర్వహించిన ఈ కార్యక్రమంలో మండల కేంద్రంలోని పలు ప్రాంతాల ప్రజలకు అంబలి అందించారు. ప్రత్యేకంగా ఉపాధి కూలీలకు రాగి జావ అంబలి పంపిణీ చేసి వారి ఆరోగ్యంపై శ్రద్ధ చూపారు. వేసవి కాలంలో శరీరానికి చల్లదనాన్ని, శక్తిని అందించే రాగి జావను అందించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ యువసేన సభ్యులు మాట్లాడుతూ, సమాజ సేవే తమ లక్ష్యమని, భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం యువ సభ్యులు, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిరం

**తుర్కపల్లి, మే 2** తుర్కపల్లి మండలం గొల్లగూడెం గ్రామపంఛాయతీ ఆవరణలో సర్పంచ్ ధరావత్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు .ఈ సం దర్భంగా డాక్టర్ ఎండి జమీల్ డి ఓ ఏ మాట్లా డుతూ వాసవి ఐ హాస్పిటల్ వలిగొండ ఆధ్వర్యం లో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించి గ్రామంలోని ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు

# కీసర మండలంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ప్రముఖులు





**మే 2:**
మేడ్చల్ నియోజకవర్గంలోని కీసర మండలంలో శనివారం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మరియు నియోజకవర్గ ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు ఎంతో మేలు చేస్తున్నాయని తెలిపారు. ముఖ్యంగా పెళ్లిళ్ల సమయంలో ఆర్థిక భారం తగ్గించేందుకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు ఉపయోగకరంగా ఉన్నాయని పేర్కొన్నారు. అలాగే అత్యవసర పరిస్థితుల్లో సీఎం రిలీఫ్ ఫండ్ (CMRF) ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం ప్రజలకు ఉపశమనం కలిగిస్తోందని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహులు యాదవ్, అలియాబాద్ మున్సిపల్ చైర్మన్ కంఠం శిరీష కృష్ణ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బిమిడి జైపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంకి రమేష్, వైస్ చైర్మన్ కాన్రెడ్డి మాలతి మాధవ రెడ్డి, కౌన్సిలర్లు సామల జశ్వంత్ రెడ్డి, సరసం వనజ ఆశోక్ రెడ్డి, డైరెక్టర్ తుంకి భిక్షపతి, నాయకులు బందరి బాబు, గురకాల సాయి కృష్ణ యాదవ్, నెమురి రామ్ ప్రసాద్, వివిధ శాఖల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్య

# పదవ తరగతి లో ఉత్తీర్ణులైన విద్యార్థులను సన్మానించిన సర్పంచ్



**తుర్కపల్లి ,మే 2**
తుర్కపల్లి మండలం జేతురామ్ తండా, సంగ్యా తండా గ్రామపంచాయతీ పరిధిలోని 15 మంది పదవ తరగతి విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించడంతో అందులో భూక్య హిందూ 567 మార్కులతో మొదటి స్థానంలో నిలిచింది. నునావత్ నందు భూక్య సిరి మల్లికా, భూక్య మేఘన, రుణావత్ చరణ్, భూక్య విజయ్, రుణావత్ మజ్ను, భూక్య ధనుష్, లకావత్ విజయ్, భూక్య భాషా, భూక్యనందిని, భూక్యమన్సింగ్, రుణావత్ రక్షిత, లను గ్రామ సర్పంచ్ భూక్య సంతోష్ నాయక్ అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు కాలంలో ఉన్నత శిఖరాలను అధిరోహించి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. విద్య ద్వారా మాత్రమే మన బతుకులు బాగుపడతాయని అది నేను బలంగా నమ్ముతానని ఇక్కడ తల్లిదండ్రులు నిరక్షరాశులు కావడం చేత పిల్లల్ని పట్టించుకునే నాధుడు లేదని అందుకే వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించి వారిని అత్యంత స్థానంలో తీర్చిదిద్దరమే నా లక్ష్యమని అన్నారు

# వేణుగోపాల స్వామి రథోత్సవం లో పర్ష హన్మాండ్లు



**రాజన్న సిరిసిల్ల జిల్లా/గంభీరావుపేట/మే2**
గంభీరావుపేట మండలం కొత్తపల్లి వేణుగోపాల స్వామివారి రథోత్సవం లో శనివారం రోజున బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతి వినిధి పర్ష హన్మాండ్లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు,ఈ సందర్భంగా దేవాలయ కమిటీ ఆధ్వర్యం లో ఛైర్మెన్,సభ్యులు పర్స హన్మాండ్లు ను శాలువాతో సత్కరించారు,అనంతరం పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ చారిత్రక నేపథ్యం కలిగిన వేణుగోపాల స్వామినీ చిన్నప్పటి నుండి దర్శించుకుంటున్నానని ఈ రోజు ప్రత్యేకంగా దర్శించుకోవడం నా అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు, ప్రజలు సుఖ సంతోషాలతో ఆయు ఆరోగ్యాలతో ఉండాలని రైతులకు పాడి పంటలు సంవృద్ధిగా పండాలని మనస్పూర్తి గా కోరుకున్నానని వరన్నారు,


# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



**ప్రజా అక్షరం, మే2 :**
మేడ్చల్ నియోజకవర్గంలోని కీసర మండలంలో శనివారం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కుల పంపిణీ కార్య క్రమం ఘనంగా నిర్వహించారు. అలియాబాద్ మున్సిపాలిటీ పరిధి లోని 7వ వార్డు లబ్ధిదారులకు వార్డు కౌన్సిలర్ గాదె వెంకటేష్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఆదివారం తుర్కపల్లిలో జహంగీర్ సంస్మరణ సభ హాజరుకానున్న ప్రముఖులు

**ప్రజా అక్షరం మే 2**
యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో సామాజిక ఉద్యమ కళాకారుడు జహంగీర్ సంస్మరణ సభను ఆదివారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తన గాత్రంతో, ఆటపాటలతో పల్లె పల్లెను చైత న్యపరిచిన ప్రజా కళాకారుడిగా జహంగీర్ గుర్తింపు పొందారు. తన కళాబృందంతో గ్రామ గ్రామాన తిరుగుతూ ఉద్యమ గీతాలను ఆలపించి ప్రజల్లో అవగాహన కల్పించిన ఆయన సేవలు చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు. ఇలాంటి గొప్ప కళాకారుడిని కోల్పోవడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తుర్కపల్లిలోని జెఎం ఫంక్షన్ హాల్‌లో జరిగే ఈ సంస్మరణ సభకు ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, మాజీ ఎమ్మెల్యే గొంగడి సునీత, కవి గాయకుడు ఎమ్మెల్సీ దేశపతి శ్రీని వాస్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కవులు కళాకారులు. అభిమానులు హాజరుకానున్నారు.




# ఎమ్మెల్యే చొరవ తో మృతుని కుటుంబానికి రూ.1.5 కోట్ల పరిహారం:



**చిట్యాల,మే 2 :**
చిట్యాల మండలం పిట్టంపల్లిలోని న్యోస్లాబ్ ఫార్మా కంపెనీలో శుక్రవారం ప్రమాదవ శాత్తు రియాక్టర్ పేలి చిన్నకాపర్తికి చెందిన బాలకృష్ణ అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం న్యోస్లాబ్ కంపెనీ యాజమా న్యంపై ఉక్కు పాదం మోపారు. చని పోయిన బాధితుడికి రూ.10 లక్షలకు మించి ఇవ్వనన్న యాజమాన్యాన్ని పట్టుబట్టి, ఎవరి ఫోన్లకు లొంగకుండా, బాధిత కుటుంబానికి రూ.1.5 కోట్ల నష్ట పరిహారం ఇప్పించారు. ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వీరేశం చొరవ పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

Printed, published and owned by Rachamallu Madhavi Printed at Kranthi Printing Press, 42/603/1/1-a, Mj Colony, Street no 5, Mjcolony, Moulali Secundrabad, and Published from h.no: 10-10-117/150, Nayi brahmana colony. Neerugonda Hanuman road, Nagaram Nizamabad (m&d) 503001, Telangana, Editor : Rachamallu Madhavi. RNI Reg No :tel/2024/89323, Cell 6305026524, Email:janasangarshana@gmail.co